ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 24 జనవరి 2025



‘చెత్త’లో సంత

జిల్లాలోనే ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే సంతగా పేరొందినా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచింది పీలేరు వారపు సంత. ప్రతి ఏడాది లక్షలకు లక్షలు ఆదాయం తెచ్చి పెడుతున్నా, పంచాయతీ పాలకవర్గాలు కానీ, ప్రభుత్వాలు కానీ పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. దశాబ్దాల క్రితం ఎలాగుందో నేటికీ అలాగే ఉంది. దీంతో సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చెత్తకుప్పల మధ్యలో తీవ్ర దుర్గంధాన్ని భరిస్తూ సంతలో తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.



ప్లాస్టిక్ పట్టల కింద జరుగుతున్న పీలేరు వారపు సంత



చెత్తాచెదారం పక్కనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్న రైతులు



- ఆదాయంలో కామధేనువు.. వసతులు కరువు
- చెత్తకుప్పల మధ్యలోనే కూరగాయల అమ్మకం
- ప్లాస్టిక్ పట్టల నీడన వ్యాపారం
- అభివృద్ధికి నోచుకోని పీలేరు వారపు సంత

పీలేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ప్రాంగణంలో ప్రతి మంగళవారం సంత జరుగుతుంది. పీలేరుతో పాటు కేవీపల్లె, సదుం, పులిచెర్ల, కలికిరి, సోమల, పుంగనూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తమ ఉత్పత్తులు సంతకు తీసుకువస్తుంటారు. కూరగాయల దగ్గర నుంచి నిత్యావసర సరుకుల దుకాణాలు పెద్దఎత్తున సంతలో వెలుస్తుంటాయి. ఆధునిక సూపర్ మార్కెట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా పీలేరుతో పాటు కల్లూరు, పుంగనూరు ప్రాంతాల నుంచి చాలా మంది హోల్‌సేల్ వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. సాధారణంగా చాలాచోట్ల ఇప్పటికీ సంతలు మధ్యాహ్నం తరువాత మొదలై సాయంత్రానికి పూర్తవుతుంటాయి. పీలేరు వారపు సంత మాత్రం ప్రతి మంగళవారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఉంటుంది. పీలేరు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు వారానికి సరిపడా సరుకులు, కూరగాయలు పీలేరు సంత నుంచి తీసుకెళ్తుంటారు.

సరుకుల రవాణాతో పాటు సామాన్య వినియోగదారుల రాకపోకలకు కూడా సౌకర్యంగా ఉండడంతో దానికున్న ప్రాధాన్యత తగ్గడం లేదు. దీంతో పీలేరు వారపు సంతకు పంచాయతీ ప్రతి ఏడాది నిర్వహించే వేలం పాటలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది. సంతలో జరిగే లావాదేవీలను చూసి ఎలాగైనా సంత వేలాన్ని దక్కించుకోవాలని పదుల సంఖ్యలో వ్యాపారులు పోటీ పడుతుంటారు. దీంతో గడిచిన దశాబ్దకాలంగా వారపు సంత వేలం పాట గణనీయంగా పెరిగింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో వారపు సంత రూ.30 లక్షలు పలికిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కరోనా తరువాత పరిస్థితులు మారడంతో కాసింత వెనుకబడినప్పటికీ పంచాయతీకి సమకూరుతున్న ఆదాయంలో వారపు సంత గణనీయమైన పాత్ర.

స్థలాభావంతో రైతుల ఇక్కట్లు

దినాదినాభివృద్ధి చెందిన పీలేరు వారపు సంతకు వస్తున్న రైతుల సంఖ్య రెండేళ్లుగా గణనీయంగా పెరిగింది. దీంతో సంత ప్రాంగణం సరిపోకపోవడంతో వారు సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఆర్టీసీ బస్టాండు, పద్మావతినగర్ రోడ్లలో తమ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో సంత రోజు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయి రాకపోకల కోసం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ముక్కుమూసుకోవాల్సిందే..

సంత జరిగిన తరువాత అక్కడ మిగిలే వ్యర్థాలను శుభ్రపరచకపోవడంతో అవి కుళ్లిపోయి ప్రాంగణమంతా దుర్గంధభరితంగా మారుతోంది. దానికి తోడు సంత పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను సంతలోనే పారవేస్తుండడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. చెత్తాచెదారాల నడుమే రైతులు తమ కూరగాయలు విక్రయానికి పెట్టడం, విధి లేక వినియోగదారులు కూడా అక్కడే కొనుగోలు చేయాల్సి రావడంతో ఒకచేత్తో లావాదేవీలు, మరో చేత్తో ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మందుబాబులు మద్యం సీసాలను పగలగొట్టి ప్రాంగణంలోనే వేస్తున్నారు.



పద్మావతినగర్ రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న రైతులు

వారపు సంత వేలం ఆదాయం

2019-20	ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షలు
2020-21	కరోనా కారణంగా వేలం నిర్వహించలేదు
2021-22	రూ.18.10 లక్షలు
2022-23	(ఎనిమిది నెలల కాలానికి) రూ.10.80 లక్షలు
2023-24	రూ.12.65 లక్షలు (స్వయంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పాటకు పూనుకోవడంతో ఎవరూ పోటీ పడలేదు)
2024-25	(ఏడు నెలల కాలానికి) రూ.10.47 లక్షలు

ప్లాట్‌ఫాంలు నిర్మించారు.. పైకప్పు మరిచారు

సువిశాల ప్రాంగణంలో సంత జరుగుతుండడంతో ప్రతి వారం సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులు పెరుగుతూ వస్తున్నారు. అయితే పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు దానిని అభివృద్ధి చేయడంలో పంచాయతీ పాలకవర్గాలు దృష్టి సారించలేదు. దీంతో ఇప్పటికీ సంతలో వ్యాపారులు ప్లాస్టిక్ పట్టల కింద దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అటు వ్యాపారులు, రైతులు, ఇటు వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చెత్తకుప్పల పక్కనే కూర్చుని దుర్గంధాన్ని భరిస్తూ సంత చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో వ్యాపారులు కూర్చోవడానికి సంత ప్రాంగణంలోని సగభాగంలో ప్లాట్‌ఫాంలు నిర్మించినా వాటికి పైకప్పు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో వాటి ఉపయోగం కూడా నామమాత్రంగా మిగిలింది. సంతకు వచ్చే వారికి కనీసం తాగునీటి సౌకర్యం కల్పించడంలో కూడా పాలకవర్గాలు విఫలమయ్యాయి. సంత ప్రాంగణంలోనే ఓ ఓవర్‌హెడ్ ట్యాంకు, దానిని అనుబంధంగా ఆర్వో ప్లాంటు ఉన్నా సంతలో నామమాత్రంగానైనా తాగునీటి కొళాయిల ఏర్పాటు మరిచారు. వారపు సంతను రూ.25 లక్షలతో అభివృద్ధి చేస్తామని 2023 డిసెంబరులో పంచాయతీ పాలకవర్గం ప్రకటించినా ఇప్పటి వరకు దాని అభివృద్ధిపై ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదు.



ప్లాట్‌ఫాంలు నిర్మించి అలా వదిలేశారు...

రూ.30 లక్షలతో అభివృద్ధికి ప్రతిపాదనలు



పీలేరు వారపు సంతను అభివృద్ధి చేసేందుకు ఇటీవల రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వ అనుమతులు మంజూరు కాగానే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. ప్రతిపాదనల ఆమోదం గురించి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కూడా ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఆయన చొరవతో త్వరలోనే అభివృద్ధి పనులు కార్యరూపం దాల్చుతాయని ఆశాభావంతో ఉన్నాం.

- గురుమోహన్, ఈవో, పీలేరు గ్రామ పంచాయతీ



ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

- జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రాజంపేటలో పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం

రాజంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా గురువారం రాజంపేటలోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అనేకమంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అదేవిధంగా లోకేశ్ గ్రీన్‌జోన్ పేరిట 2 వేల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టి నారా లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మల్లెల శ్రీవాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, ఎస్సీసెల్ నేత మందా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లంకమలలో బండలపై రేఖా చిత్రాలు



సిద్దవటం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రేంజ్ పరిధిలో కొండరాళ్లపై చిత్రీకరించిన పురాతన రేఖా చిత్రాలను గుర్తించామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ సంరక్షణలో భాగంగా లంకమల్లలో కూంబింగ్ చేస్తుండగా కొండరాళ్లపై విచిత్ర చిత్రాలు కనిపించడంతో వాటిని ఫొటోలు తీశామన్నారు. ఇవి ఆది మానవులు చెక్కినవా, రాజుల పరిపాలనలో కళాకారులు చిత్రీకరించినవా అని తెలియాల్సి ఉందన్నారు. రేఖా చిత్రాలు ఏళ్లతరబడి చెక్కు చెదరకుండా ఉన్నాయంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. సిద్దవటం రేంజ్‌లోని రోళ్లబోడు, మద్దూరు, కొండూరు, సిద్దవటం బీట్ అటవీ ప్రాంతంలోని కొండరాళ్లపై ఉన్న ఈ పురాతనమైన చిత్రాలను గుర్తించామన్నారు.



ముగ్గురికి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

రాయచోటి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఓటర్ల జాబితా తయారీలో జిల్లాలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ముగ్గురికి ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ గురువారం ప్రకటించారు. జిల్లాలోని పీలేరు నియోజకవర్గం కేవీ పల్లె మండల తహసీల్దార్ ఎస్.క్రాంతికుమార్ ఏఈఆర్‌వోగా విధుల్లో పాల్గొని బాధ్యతాయుతంగా పనిచేసినందుకు అవార్డు ప్రకటించారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పోలింగ్ స్టేషన్-74లో విధులు నిర్వహించిన బీఎల్‌వో ఎం.శ్రీనివాసులు, రాయచోటి నియోజకవర్గం పోలింగ్ స్టేషన్-165లో విధులు నిర్వహించిన బీఎల్‌వో గంగులయ్యలకు కూడా ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డులను ప్రకటించారు. వీరికి ఈనెల 25వ తేదీ జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డులు అందచేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరమణ..

రామసముద్రం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు... పుంగనూరు మండలం దిగువపల్లెకు చెందిన వెంకటరమణ (59), పత్తెమ్మగారిపల్లెకు చెందిన గంగాధర్ (44) ఇరువురు ద్విచక్రవాహనంలో వనగానిపల్లె సమీపంలోని ఓ కోళ్ల ఫారం వద్దకు వచ్చారు. అక్కడి నుంచి తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా నాయుడుపేట నుంచి చిక్‌బళ్లాపూర్ వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐతో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వెంకటరమణ కుమారుడు శ్రీనివాసులురెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.







మృతి చెందిన గంగాధర్, వెంకటరమణ (ఫైల్)

పంచాయతీలకు పండగే

- ఆర్థిక సంఘం నిధులు రూ.87.22 లక్షలు విడుదల
- సక్రమంగా వినియోగిస్తే పంచాయతీలకు మహర్దశ

6

మళ్లీ తెరపైకి డిటెన్షన్.?!

- ఇకపై 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం
- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టానికి సవరణ

6

కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు

6

పాడి అభివృద్ధి చెందితేనే రాష్ట్రం పురోగతి

- పశు సంవర్ధకశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ వెంకటరావు

రాజంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటలతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని పశు సంవర్ధకశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు కె.వెంకటరావు తెలిపారు. గురువారం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన గోకులాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు పాడి రైతులతో మాట్లాడారు. పుల్లంపేట మండలం కోనయ్యగారిపల్లెలో జరిగిన పశు వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి పశువులకు టీకాలు వేశారు. జాగువారిపల్లెలో మినీ గోకులాన్ని పరిశీలించారు. స్థానికంగా దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు తాపించారు. రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో జరిగిన పశువైద్య శిబిరాన్ని పరిశీలించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మినీ గోకులాలను సబ్సిడీపై మంజూరు చేసిన యంత్రాలను పరిశీలించారు. రాజంపేట డివిజన్‌లో పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తోందని తెలిపారు. స్థానిక పశువైద్యులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు వై.భాస్కర్‌రావు, సహాయ సంచాలకుడు కె.ప్రతాప్, పుల్లంపేట పశువైద్యాధికారి డాక్టర్ దూపాటి సుదీ ష్, అత్తిరాల పశువైద్యాధికారి భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

కనిపించని అధికారులు

- సోమవారం మాత్రమే దర్శనమిస్తారు
- మిగతా రోజుల్లో కడప నుంచే ఉద్యోగం
- ఆ కార్యాలయాలకు ఎప్పుడూ తాళాలే
- జిల్లా ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఇదే పరిస్థితి
- ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ అధికారుల తీరు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం, మైనార్టీ కార్పొరేషన్ శాఖల అధికారులు కనుచూపు మేర కనిపించడం లేదని ఆ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు వాపోతున్నారు. ప్రతి సోమవారం పీజీఆర్‌ఎస్‌లో మాత్రమే కనిపించే ఆ అధికారులు మిగిలిన రోజులు మాత్రం తమ కార్యాలయాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో జిల్లాలు ఏర్పాటు చేశారే కానీ అందుకు సంబంధించిన శాఖల అధికారులను కేటాయించడంలో నిర్లక్ష్యం వహించారన్న వాదన ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని అధికారులను పూర్తి స్థాయిలో నియమిస్తారని అందరూ ఆశపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 8 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు కొత్త జిల్లాల్లో ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. మైనార్టీలకు చెందిన ప్రజలు కానీ, ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన ప్రజలు ఏదైనా సమస్యలతో వచ్చిన వారు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అడిగితే వారు పక్క ఆఫీసుకు వెళ్లండి అని ఉచిత సలహా ఇస్తూ ఆ అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో మాకు కూడా తెలియదని చెప్పేస్తున్నారు. ఈ రెండు శాఖల కార్యాలయాల్లో కనీసం వారానికి ఒకసారి కూడా తలుపులు తెరుచుకోని పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రతి సోమవారం జిల్లా అధికారులు అందరూ కూడా అటెండెన్స్ రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నారు. అయితే ఈ అధికారులు మాత్రం కడప నుంచి రాయచోటి కలెక్టరేట్‌కు రాకుండా వారి అటెండర్‌ను పంపించి సంతకాలు చేయమని చెబుతున్నారని తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ శాఖలపై చొరవ తీసుకొని కొత్త జిల్లాలకు అధికారులను కేటాయిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్సీ కార్పొరేషన్ అధికారిని వివరణ కోరగా మమ్మల్ని అన్నమయ్య జిల్లాకు కేటాయించలేదని, కడప జిల్లాలోనే ఉండమని చెప్పారని, కేవలం ఇన్‌చార్జి మాత్రమే ఇచ్చారని కాబట్టి వారానికి ఒకసారి రాయచోటికి వచ్చి వెళ్లిపోతున్నామని సమాధానం ఇచ్చారు.



తెరుచుకోని మైనార్టీ, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాలు

రుణాల మంజూరులో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్)/చిన్నమండెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్లు ఇచ్చే రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్, బ్యాంకర్లతో ప్రత్యేక జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి బ్యాంకర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ల అధికారులు నిబద్ధతతో పనిచేసి లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌డీఎం ఆంజనేయులు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్లలోని 690 యూనిట్లకు గాను రూ.11.97 కోట్ల విలువైన రుణాలను బ్యాంకుల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. రవాణా శాఖకు సంబంధించిన 50 శాతం సబ్సిడీ, పశుసంవర్ధక శాఖకు సంబంధించి 40 శాతం సబ్సిడీ, ఐఎస్‌బీ శాఖకు సంబంధించి 60 శాతం సబ్సిడీ, వ్యవసాయ శాఖకు సంబంధించి 50 శాతం సబ్సిడీ ఇస్తూ బ్యాంకులు రుణాలు అందజేస్తాయని తెలిపారు. ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్‌ల ఈడీ బ్రహ్మయ్య మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలను పొందేందుకు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



చిన్నమండెంలో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

అర్జీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కార నిమిత్తం కలెక్టర్ శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిన్నమండెం మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన కొన్ని అర్జీలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా గురువారం ఉదయం చిన్నమండెం మండలాన్ని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడటంతో పాటు చిన్నమండెం తహసీల్దారుకు తగు సూచనలు చేశారు.

మళ్లీ తెరపైకి డిటెన్షన్.?!

- విద్యార్థులు పాసైతేనే పైచదువులకు
- ఇకపై 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం
- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టానికి సవరణ
- ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిటెన్షన్ విధానం మళ్లీ తెరపైకి వచ్చింది. పాఠశాల స్థాయిలో 5, 8 తరగతుల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే పైతరగతులకు పంపించే డిటెన్షన్ పాలసీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిటెన్షన్ అమలుతోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగి పైచదువుల్లో రాణిస్తారని కేంద్రం ఆలోచన చేస్తోంది. ఈ విధానం ప్రైవేట్ పాఠశాలలకు లబ్ధి చేకూరుస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర క్యాబినెట్‌లో కూడా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో డిటెన్షన్ విధానంపై ప్రత్యేక కథనం..

కేంద్ర ప్రభుత్వం పిల్లల ఉచిత నిర్బంధ విద్యాచట్టం-2010కి సవరణలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. మారిన నిబంధనలను పిల్లల ఉచిత మరియు నిర్బంధ విద్య (సవరణ) నియమాలు-2024 అని పిలుస్తారు. తాజా సవరణ నిబంధనల ప్రకారం 5, 8 తరగతుల్లో విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని పిల్లలను అదే తరగతులకు డిటైన్ చేస్తారు. అంటే పై తరగతికి పంపించరు. ఫలితాల ప్రకటన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలో విద్యార్థులకు తిరిగి పునఃపరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారిని మాత్రమే పై తరగతులకు ఉన్నతీకరిస్తారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను కూడా చైతన్యపరచాల్సి ఉంటుంది. ఆ పాఠశాల అధిపతి వెనుకబడిన విద్యార్థుల జాబితాలు తయారు చేసుకుని వ్యక్తిగతంగా వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పరీక్ష మరియు పునఃపరిశీలన అనేది పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధించడానికి సామర్థ్య ఆధారిత పరీక్షలుగానే ఉండాలి కానీ కంఠస్థం మరియు విధానపరమైన నైపుణ్యాలపై ఆధారపడి ఉండకూడదని తాజా సవరణ ఉత్తర్వుల్లో కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. దీనికై కేంద్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. దీనితో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూల్లో మరియు ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆధీనంలో పనిచేస్తున్న బడుల్లో కొత్త డిటెన్షన్ విధానం అమల్లోకి వస్తుంది. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వాలకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ప్రకారం అమలు పరచడంలో ఆప్షనల్‌గా నర్ణయించుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నందున అమలుపరిచే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



1970 వరకు డిటెన్షన్ విధానం

ఉమ్మడి రాష్ట్రంలో 1970 వరకు ప్రాథమిక విద్యలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేది. విద్యార్థులు బడులకు దూరంగా ఉండేవారు. అప్పటి వరకు డిటెన్షన్ విధానం అమల్లో ఉండేది. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు, మధ్యలో బడి మానేసే పిల్లల సంఖ్య (డ్రాపౌట్స్)ను తగ్గించేందుకు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో 7, 10 తరగతులను మినహాయించి మిగిలిన తరగతులకు 1971లో నాన్‌డిటెన్షన్ (పరీక్షలతో సంబంధం లేకుండా పైతరగతికి పంపడం) విధానాన్ని ప్రవేశపెట్టారు.

పరీక్షలు ఒక్కటే ముఖ్యం కాదు

ఏడో తరగతి తర్వాత పైతరగతికి వెళ్లాలంటే కామన్ ఎగ్జామ్స్ విధానాన్ని 1971 నుంచే అమలు చేశారు. గణిత, సైన్స్, ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా చూడాలన్న లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే పాఠ్యాంశాల బోధనకు తగినట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోను పరీక్షల నిర్వహణ ఓ పార్సుగా మారింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్ని ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. దీనివల్ల పరిస్థితులు విషమిస్తున్నాయన్న ఉద్దేశంతో 7వ తరగతిలో కామన్ పరీక్షల విధానానికి 2008లో విద్యాశాఖ స్వస్తి చెప్పింది. ఈ నేపథ్యంలో ఎక్కువమంది డిటెన్షన్ విధానం వద్దని అభిప్రాయపడుతున్నారు. నాన్ డిటెన్షన్ విధానం వలన పిల్లలు ఏటా పై తరగతికి వెళ్తుండడంతో డ్రాపౌట్స్ శాతం క్రమంగా తగ్గింది. అక్షరాస్యత పెరుగుతూ వస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పించి ఇతర పనుల్లో పెట్టకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడుతోంది. విద్యార్థుల్లో పరీక్షల భయం తగ్గింది.

బడుగు బలహీన వర్గాల పిల్లలు పాఠశాలలకు రావడం క్రమేణా పెరిగింది. బాలికల్లో అక్షరాస్యత సైతం నాన్ డిటెన్షన్ విధానం వల్లనే సాధ్యమైందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే.. డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తే విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో బాధ్యత పెరుగుతుందని, ఉపాధ్యాయులు శ్రద్ధతో బోధన చేస్తారనే వాదనా వినిపిస్తోంది. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని, ఉన్నత విద్యలోను రాణిస్తారని అంటున్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో కానీ.. పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు మాత్రం 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం వద్దనే అంటున్నారు.

డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి



కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 5, 8 తరగతుల డిటెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య పిల్లలకు అందాలంటే 9వ తరగతి వరకు నాన్ డిటెన్షన్ విధానం మాత్రమే ఉండాలి. 10వ తరగతి నుంచి మాత్రమే డిటెన్షన్ విధానం అమలు చేయాలి. లేకుంటే డ్రాపౌట్ల శాతం పెరుగుతుంది. ఉచిత నిర్బంధ విద్యకు తూట్లుపడతాయి. ఒక వేళ తప్పదు అనుకుంటే 8వ తరగతికి మాత్రమే డిటెన్షన్ విధానాన్ని ఆలోచించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

సమర్థనీయం కాదు



బాలలందరికి ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యను అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. డిటెన్షన్ విధానం వలన గ్రామీణ ప్రాంతాలలో డ్రాపౌట్ శాతం పెరిగే అవకాశం ఉంది. గతంలో 7వ తరగతికి సంబంధించి కామన్ పరీక్షలు ఉన్న విషయం మనకు తెలిసిందే. కానీ ఆచరణలో అది సరైన రీతిలో ఫలితాలను ఇవ్వలేకపోవడం వలన దానిని తీసివేయాల్సి వచ్చింది. కావున డిటెన్షన్ విధానమనేది 10వ తరగతి వరకు వాంఛనీయం కాదు.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

నో డిటెన్షన్ విధానాన్నే కొనసాగించాలి




తప్పనిసరిగా 5వ, 8వ తరగతిలోని విద్యార్థులు వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాస్ కాలేక, బడికి రాకుండా డ్రాపౌట్‌గా మిగిలే అవకాశం ఉంటుంది.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సరైన అవగాహన లేక, విద్యార్థులు ఉత్తీర్ణత కాలేక, ఒత్తిడి వలన పాఠశాలకు దూరమయ్యే అవకాశం ఉంది. విద్య అనేది రాష్ట్ర పరిధిలోని అంశం కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు అమలులో ఉన్న నోడిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.

-ఎస్.రామాంజనేయులు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు


డిటెన్షన్ విధానం ఉండాల్సిందే



ప్రస్తుత పరిస్థితుల్లో డిటెన్షన్ విధానం ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి, బోధన నైపుణ్యాలు పెంపొందించాలంటే డిటెన్షన్ విధానం అవసరం. గతంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండడం వలన నిరక్షరాస్యత రేటు తగ్గించాలనే ఉద్దేశంతో నాన్ డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం విద్య గురించి తల్లిదండ్రులందరిలో అవగాహన పెరిగింది. ప్రతి తల్లితండ్రి నాణ్యమైన విద్య కావాలని కోరుకుంటున్నారు. కాబట్టి డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నాం.

- లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

డిటెన్షన్ విధానం వద్దు



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 5వ తరగతి, 8వ తరగతి విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రకటన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. గతంలో అనేక మందితో చర్చించిన పిదప 7వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్ రద్దు చేశారు. మరిప్పుడు 5వ, 8వ తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానం ఎందుకు? దీని వెనక బడుగు బలహీన పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర దాగి ఉంది. డిటెన్షన్ విధానం అమలు ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- బి.లక్ష్మీరాజా, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

కేఎంసీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కడప స్పోర్ట్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర మునిసిపల్ మైదానంలో గురువారం కేఎంసీ స్పోర్ట్స్ మీట్‌ను కడప నగర పాలక కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో 100, 400, 4 ఇంటూ 400 రన్నింగ్‌తో పాటు వాలీబాల్ పోటీలను వివిధ పాఠశాలల బాల, బాలికలకు నిర్వహించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

100 మీటర్ల బాలికల విభాగంలో... : 100 మీటర్ల బాలికల విభాగంలో ప్రథమస్థానం ఎం.శ్రీలతారెడ్డి (ప్రభుత్వ బాలికల పాఠశాల, కడప), ద్వితీయ స్థానం వేద వర్షిణి (స్పోర్ట్స్ స్కూల్), తృతీయస్థానం జె.కీర్తన (అంబేడ్కర్ స్కూల్) నిలిచారు.

బాలుర విభాగంలో... : 100 మీటర్ల బాలుర విభాగంలో బి.రాముడు (స్పోర్ట్స్ స్కూల్) ప్రథమస్థానం, జె.తిమోతి (గాంధీనగర్ స్కూల్) ద్వితీయ స్థానం, ఎల్.జస్వంత్‌రెడ్డి (కడపస్కూల్), తృతీయస్థానం సాధించారు

400 మీటర్ల రిలే పరుగులో... : 400 మీటర్ల రిలే పరుగులో విద్యామందిర్ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలువగా, ద్వితీయ స్థానం సాల నాగయ్య (మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్), తృతీయ స్థానం నాగరాజుపేట మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు సాధించారు.

వాలీబాల్ విభాగంలో... : వాలీబాల్ పోటీలలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించగా, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ అగాడి విద్యార్థులు ద్వితీయస్థానం, మున్సిపల్ మెయిన్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు.

నేడు బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు : స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 24వ తేదీ శుక్రవారం ఉదయం కబడ్డీతో పాటు బ్యాడ్మింటర్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



పరుగు పందెంలో బాలికలు

మదనపల్లెవాసికి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం

మదనపల్లె అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన యూత్ కరాటే క్లబ్ అధ్యక్షుడు ఏఆర్ సురేశ్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అందుకున్నారు. గురువారం హైదరాబాదులోని భాస్కర ఆడిటోరియంలో మాస్టర్ కేశవ కరాటే అకాడమీ ఇండియా వారి ఆధ్వర్యంలో పురస్కారం అందించారు.



ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారంతో సురేశ్

కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి వారి ప్రతిభతో పాటు సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందులకు ఈ పురస్కారం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కేశవ అకాడమీ అధ్యక్షుడు కేశవగౌడ్ మాట్లాడుతూ కరాటే వృత్తిలోనే కాకుండా తోటి మాస్టర్లు ఇబ్బందుల్లో ఉంటే వారికి ఆర్థికసాయం అందించడంలో ఏఆర్ సురేష్‌కు సాటి లేరన్నారు. కార్యక్రమంలో శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, లండన్, సౌదీ అరేబియా తదితర దేశాలతో పాటు 12 రాష్ట్రాల మాస్టర్లు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కురబ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శ్రీరామతులసి కల్యాణ మండపంలో భక్త శ్రేష్ఠ కనకదాస్ 537వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కురబ సంఘ ప్రతినిధులు, కార్పొరేట్ డైరెక్టర్లు, కురబ కులస్థులు పాల్గొన్నారు. ముందుగా కనకదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో కురబలు రాజకీయాల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నపటికీ రాజకీయంగా కురబలకు న్యాయం జరగడం లేదన్నారు. కురబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ముందుకు రావాలన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చైతన్య యాత్రలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 2వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పం నుంచి యాత్రలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుమల పుణ్యక్షేత్రంలో ఇతర కులాలకు కేటాయించిన విధంగా కురబల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలన్నారు. టీటీడీ, శ్రీశైలం దేవస్థానాల్లో కమిటీల్లో కురబలకు అవకాశం కల్పించాలన్నారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల లోన్లు కురబ కులస్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన ప్రజాప్రతినిధులను, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు జ్ఞాపికలు అందించి సన్మానించారు. అనంతరం ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో మూడోసారీ రాష్ట్ర అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురబ యువత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తలపల్లె కోటి సురేశ్, యూత్ అధ్యక్షుడిగా కాటమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, లింగమూర్తి, విఠల్ గౌడ్, దండు కేశవ, కప్పల అనిల్, రిటైర్డ్ డీఎస్పీ పోతప్ప, జంజుడప్ప, సుధాకర్, ఈశ్వరయ్య, మురళి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు వలిగట్ల వెంకటరమణ, పరిమళ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

పంచాయతీలకు పండగే

- ఆర్థిక సంఘం నిధులు రూ.87.22 లక్షలు విడుదల
- గత ప్రభుత్వంలో నిధులు దారి మళ్లించిన వైనం
- సక్రమంగా వినియోగిస్తే పంచాయతీలకు మహర్దశ

సుండుపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు కూటమి సర్కారు చొరవతో మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా పురిపుష్టిని సంతరించుకోనున్నాయి. సుండుపల్లె మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మండలంలో 10 గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరిగాయి. సర్పంచులు కొలువుదీరిన తరువాత అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు. నిధుల లేమితో పంచాయతీల్లో లైట్లు సైతం మార్చలేని స్థితిలోకి వెళ్లాయి. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచులను పూర్తిగా కీలుబొమ్మలుగా మార్చారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించింది. దీంతో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడాయి. గ్రామ పంచాయతీల్లో కనీసం ప్రజలకు తాగునీరు సైతం అందించలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే పంచాయతీలకు మంచిరోజులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధు లు విడుదల చేసి పంచాయతీలను ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు కేంద్రం చొరవతో కూటమి సర్కారు తొలి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది.





తిమ్మసముద్రం, జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాలు

మండలానికి రూ.87.22 లక్షలు


మారుమూల సుండుపల్లె మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే సుండుపల్లె, ఈడిగపల్లె, సొంటంవారిపల్లె గ్రామ పంచాయతీలకు సర్పంచు ఎన్నికలు జరగలేదు. పలు సమస్యలపై స్థానికులు కోర్టుకు వెళ్లడంతో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన భాగంపల్లె గ్రామానికి రూ.4,62,908, చిన్న గొల్లపల్లెకు రూ5,60,892, మాచిరెడ్డిగారిపల్లెకు రూ.7,44,783, మడితాడుకు రూ.18,24,703, ముడుంపాడుకు రూ.9,69,009, పొలిమేరపల్లెకు రూ.5,22,621, తిమ్మసముద్రానికి రూ.10,56,460, పెద్దినేనికాలువకు రూ.9,85,125, జి.రెడ్డివారిపల్లెకు రూ5,25,328, రాయవరానికి రూ.10,70,412 చొప్పున 10 గ్రామాలకు కలిపి రూ.87,22,241 నిధులు గ్రామ పంచాయతీ అకౌంటుకు జమ కావడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ నిధులతో గ్రామాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు పడనున్నాయి.

దారి మళ్లించిన వైసీపీ సర్కారు

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను ఖాతాల్లోకి రాగానే దారి మళ్లించడంతో సర్పంచులు ఏం చేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. ప్రస్తుత కూటమి సర్కారు కేంద్ర ప్రభుత్వం చొరవతో నేరుగా పంచాయతీల ఖాతాలకే కేటాయించింది. దీంతో నిధులు పక్కదారి పట్టే అవకాశం లేకుండా పోయింది.

పంచాయతీలకు ఎంత నిధులొచ్చాయి అనే విషయాలను సర్పంచులు తెలుసుకునే వెసులుబాటు కలిగింది. మండలంలో పది పంచాయతీలకు టైడ్‌గ్రాంట్‌గా రూ.50,95,529 లక్షలు, అనైడ్ నిధులుగా రూ.36,26,712 లక్షలు మొత్తంగా రూ.87,22,241 లక్షలు మంజూరయ్యాయి.

అభివృద్ధి వైపు అడుగులు వేస్తాం



ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడవకముందే పంచాయతీలకు నిధులు విడుదల చేయడం సంతోషదాయకం. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు వినియోగిస్తాము. గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈ నగదు దోహదపడుతుంది. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

-మహమ్మద్ షరీఫ్, సర్పంచ్, రాయవరం

నిధులు సక్రమంగా వినియోగించాలి

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చూస్తాము. గ్రామ పంచాయతీలో ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలి. తాగునీటి సమస్యలు లేకుండా చేస్తాము. నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తాము. ప్రతి రూపాయి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి.

-సురేశ్‌బాబు, ఈవోపీఆర్‌డీ, సుండుపల్లె

అయినా... తీరు మారడం లేదు

- మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..
- జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు
- అయినా కొందరిలో మార్పు అంతంతమాత్రమే
- 13 నెలల్లో 1430 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడటమే కాకుండా.. ఇతరుల ప్రాణాలను బలగొంటున్నారు. ఇక యువత మద్యం మత్తులో ఇష్టానుసారం వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో పోలీసులు మందుబాబులపై ప్రత్యేక నిఘా పెట్టి జరిమానాలు వేసి జైలుకు పంపుతున్నప్పటికీ కొందరి తీరు మారడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసులు కడప జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి 13 నెలల్లో 1430 మందిపై కేసులు నమోదు చేశారు.

మద్యం తాగి జైలుకెళ్లిన సందర్భాలెన్నో....

కడపకు చెందిన ఓ ఆటోడ్రైవరు మద్యం తాగి వాహనం నడుపుతూ నాలుగు నెలల క్రితం పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ డ్రైవరుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడంతో రూ.10వేలు జరిమానాతో పాటు 30 రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే కడపకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా అతనికి 15 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3వేలకు పైగానే జరిమానా విధించారు. ఓ కారు డ్రైవరు మద్యం తాగి వాహనం నడుపుతుండగా నగర శివార్లలో అతన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. వారం రోజులు జైలుశిక్ష వేసి జరిమానా విధిం చారు. ప్రస్తుతం ఎవరైనా మద్యం తాగి పట్టుబడితే వారికి కోర్టు రూ.10వేలు నుంచి నెలరోజుల పాటు జైలుశిక్ష వేయనున్నారు.

వాహనాల్లోనే బార్లు, మద్యం షాపులకు...

మద్యం తాగేందుకు యువతతో పాటు కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, డ్రైవర్లు, స్నేహితులతో కలిసి బార్లు, మద్యం షాపులకు వాహనాల్లో వెళుతున్నారు. బ్యాచ్‌లతో వెళుతున్న వీరు ఫుల్‌గా మద్యం సేవించి.. తాగిన మత్తులోనే వాహనాలను నడు పుతూ ప్రమాదాలకు గురవతున్నారు. మరికొందరు ఎదుటి వారిని ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారు.



బ్రీతింగ్ ఎనలైజరుతో తనిఖీ చేస్తున్న పోలీసులు

నగర శివార్లలో.. మందుబాబుల తిష్ట

మద్యం షాపులలో మద్యం కొనుగోలు చేసి అక్కడ తాగే అవకాశం లేకపోవడంతో నగర శివార్లకు వెళ్లి అక్కడ ఓపెన్ ప్లేస్‌లో సిట్టింగ్ వేస్తారు. సరదాగా స్నేహితులతో కలిసి పీకల్లోతు మద్యం సేవించి ఆ మత్తులో వాహనాలు నడుతూ తరచూ ప్రమాదాలకు గురవతున్నారు. దీంతో గతంలో పనిచేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నగర శివార్లలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిచడంతో మందుబాబుల ఆగడాలు కాస్త సద్దుమణిగాయి. అయితే పోలీసుల నిఘా కొరవడటంతో ఇటీవల కొంత మంది యువత నగర శివార్లలో కొన్ని ప్రాంతా లను ఎంచుకుని వాహనాల్లో మద్యం తీసుకెళ్లి అక్కడ యథేచ్ఛగా తాగుతూ తూలుతుంటారు.

మందుబాబులపైనే పోలీసుల గురి

రాత్రివేళల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. నగర శివార్లతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద బ్రీతింగ్ ఎనలైజర్లతో తనిఖీలు చేపట్టి మందుబా బులను పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఈ 13 నెలల్లోనే 12,030 కేసులు కేసులు నమోదు కాగా మద్యం మత్తులో కాకుండా రాత్రుళ్లు తనిఖీల సమయంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న 1422 మందిపై కేసులు నమోదు చేశారు. ఇకపై కూడా కడప డీఎస్పీ వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో మందుబాబులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరంగానే కఠినంగా శిక్షించాలని నిర్ణయించారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. మద్యం తాగి పదే పదే పట్టుబడితే ఉపేక్షించేది లేదు. లైసెన్సు రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి పగలు అన్నివేళలా బ్రీతింగ్ ఎనలైజరుతో పరీక్షలు నిర్వహిస్తాం. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట నిలబెడతాం. కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపిస్తాం.

-జావీద్, కడప ట్రాఫిక్ సీఐ

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

సికెదిన్నె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, రమాదేవి, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీ - వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బద్వేల్ రోడ్డులో మోటర్ బైక్‌పై వెళుతున్న కంచర్ల సంటెయ్య (35) ను లారీ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. ఎస్.ఎర్రబల్లె వాసి కంచర్ల సంటెయ్య వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్. మైదుకూరులోని ఓ ఫొటో స్టూడియోలో పనిచేసి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సంటెయ్యకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారు పుట్టుకతో దివ్యాంగులని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన సి.మునిరెడ్డి (73) ప్రస్తుతం కడప కోఆపరేటివ్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య ంతో పాటు ఇతర సమస్యలతో బాధపడుతుండేవారు. గురువారం రామాంజనేయపురంలోని చర్చి వద్ద కూర్చుని మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చక్రాయపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిక్షేత్రం సమీపాన గురువారం ఆటో, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వడ్డెపల్లె గ్రామానికి చెందిన కొందరు ఆటోలో వేంపల్లెకు వెళ్తుండగా.. వేంపల్లె నుంచి బైకులో ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. గండికి సమీపంలోని పెద్దగుండు వద్ద కు రాగానే ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొ నడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడి ప్రహరీగోడను ఆనుకుంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకపోతే పది మట్ల లోతులో పడిపోయేది. ఈప్రమాదంలో వెంకటేష్, వెంకటసుబ్బమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ముగ్గురు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఫేక్ డాక్యుమెంట్లతో వ్యవసాయ రుణాలు.. వ్యక్తి అరెస్టు

కమలాపురం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫేక్ డాక్యుమెంటు సృష్టించి వ్యవసాయ రుణాలు పొంది బ్యాంకులను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామానికి చెందిన మూల నాగేశ్వర్ రెడ్డి దొంగ డాక్యుమెంటు సృష్టించి పంట రుణాలు పొందినట్లు సమాచారం రావడంతో కడప ఎస్‌డీపీవో వెంకటేశ్వర్లు, కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టరు షేక్ రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి విచారణ చేపట్టారు. గురువారం గ్రామ సమీపంలో నిందితుడు ఉన్నట్లు తెలియరావడంతో తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఫేక్ డాక్యుమెంట్లను స్వాధీనపరుచుకుని రిమాండుకు తరలించారు. కాగా, గతంలో కమలాపురం ఎమ్మార్వో ఆఫీసులో యల్లారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ వీఆర్వోగా విధులను నిర్వర్తించిన అంజి అలియాస్ రామాంజి డీకేటి భూములు, కొండలు, గుట్టలు ఇతర భూములకు సంబంధించి నాగేశ్వర్‌రెడ్డితో కలిసి ఫేక్ డాక్యుమెంటులను తయారు చేశారు. వాటి ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను మ్యుటేషన్ చేసి ఫేక్ డాక్యుమెంట్ల సృష్టించి బ్యాంకుల నుంచి ఎక్కువ మొత్తంలో క్రాప్‌లోన్లను పొంది.. ఆ డబ్బును పంచుకున్నారు. కమలాపురం మండలం, యల్లారెడ్డిపల్లె పంచాయతీలోని సర్వే నెం.645లో గల గండి సుబ్బలక్షుమ్మ అనే రైతుకు చెందిన భూమి రికార్డులను ఫేక్ డాక్యుమెంట్‌ల ద్వారా తమకు అనుకూలంగా మ్యుటేషన్ చేసుకుని ప్రొద్దుటూరు టౌన్‌లో గల కెనరా బ్యాంకు నుంచి క్రాప్ లోను ద్వారా రూ.2.50 లక్షలు తీసుకున్నారు. ఆ డబ్బులను తమ సొంతానికి వాడుకుని.. తిరిగి చెల్లించలేదన్నారు. ఇందుకు పాత్రులైన ఇంకా కొంత మంది ఉన్నారని వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు.


నిందితుని చూపుతున్న పోలీసులు

ఏఆర్ సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఏఆర్ పోలీసులకు గురువారం ఫైరింగ్ ప్రాక్టీసు చేయించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య పర్యవేక్షణలో నగర శివారులోని ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ పోలీసులకు వివిధ రకాల తుపాకులతో ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. మొబలైజేషన్‌లో భాగంగా వార్షిక ఫైరింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి వృత్తి నైపు ణ్యం పెంచుకుందామని సూచించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు సిబ్బందికి ఫైరింగ్‌లో మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఫైరింగ్ ప్రాక్టీసులో పోలీసు సిబ్బంది

నిందితుడిపై వన్‌టౌన్ సీఐ దాడి

- కోర్టులో జడ్జికి బాధితుడి ఫిర్యాదు
- సీఐకి షోకాజ్ నోటీసులు ఇచ్చిన మేజిస్ట్రేట్

ప్రొద్దుటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో అరెస్టు అయిన నిందితుడిని ఒన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి స్టేషన్లో చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిందితుడు కోర్టులో జడ్జి ఎదుట తనపై సీఐ దాడిచేసిన విషయం వెల్లడించి.. గాయాలు చూపించడంతో సీఐకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... కేహెచ్‌ఎం వీధికి చెందిన హనీఫ్ తన తల్లిదండ్రులతో గొడవపడుతూ వారిని వేధించేవాడు. సుందరాచార్యుల వీధికి చెందిన మమ్మద్ అలీఖాన్ జనవరి 19న హనీఫ్ తీరును ప్రశ్నించాడు. దీంతో నీవేంది నాకు చెప్పేది అని మమ్మద్ ఖాన్‌పై హనీఫ్ దాడిచేశాడు. ఈ దాడిలో మహ్మద్‌ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. మహ్మద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనీఫ్‌ను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఫస్ట్ ఏడిఎం కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచగా తనపై ఒన్ టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి దాడిచేసి కొట్టాడని వీపుపై వున్న రక్తగాయాలను మేజిస్ట్రేట్‌కు చూపించాడు. దీనిపై సీఐని వివరణ ఇవ్వాలని గురువారం మేజిస్ట్రేజ్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనిపై సీఐని వివరణ కోరగా షోకాజ్ నోటీసు ఇచ్చింది వాస్తవం అని తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 25వ తేదీ శనివారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం వరకు క్రికెట్ దిగ్గజం కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ రాష్ట్రస్థాయి నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు (రెండు-మ్యాచ్‌లు) నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. ఇందులో ఆంధ్ర, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ జట్లు తలపడనున్నాయన్నారు. ఆమేరకు ఈనెల 25 నుంచి 28 వరకు ఆంధ్ర-పంజాబ్ జట్ల మధ్య పోటీలు సాగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4 వరకు జరుగనున్న రెండో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు హిమాచల్‌ప్రదేశ్ జట్టుతో తలపడుతుందన్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్ర జట్ల క్రీడాకారులు కడపకు చేరుకుని సంబంధిత ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రాక్టీస్ షెషన్‌లో నిమగ్నమయ్యారు. కాగా మ్యాచ్ నిర్వహించేందుకు అనువుగా క్రికెట్ మైదానాన్ని మార్కింగ్‌తో సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ జీవనశైలితో ప్రభావవంతమైన సమాజం : వీసీ


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడ ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ జీవన శైలితో మానసిక ఆరోగ్యం కాంతులీని ప్రభావవంతమైన సమాజం ఏర్పడుతుందని వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. తమిళనాడు పెరంబుదూర్‌లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ భారత ప్రభుత్వ పార్లమెంట్ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వైవీయూ ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంపై (యూత్ మెంటర్ హెల్త్ ప్రమోషన్‌పై టీఓటీ ప్రోగ్రాం) పై శిక్షకుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. మాట్లాడుతూ సమాజంలోని ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత భేదాలు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ఇంటర్‌నెట్‌లో ఎక్కువటైం గడపడం వలన అనేక మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రతిరోజు కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లకు సమయం కేటాయించాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్ డాక్టర్ యూన్సిరాణి, డాక్టర్ లలిత, డాక్టర్ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

ఈఎఫ్ఏయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ 5,7,3 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ఫలితాలు విడుదల చేసేందుకు కృషిచేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి జి.ఫణేంద్రరెడ్డి, సహాయ అధికారి ఉదయప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి, వి.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై వైవీయులో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అన్నారు. మహిళలను గౌరవించడం ద్వారా పని వాతావరణం పెరిగి మంచి ఫలితాలు వస్తాయన్నారు. న్యాయవాదులు ఎస్.పర్వీన్ నాజ్, జి.ఉమ, సైకాలజిస్ట్ సునీత వర్క్‌ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపులు చట్టంపై అవగాహన కల్పించారు. సఖి, వన్‌స్టాప్ సెంటర్ సునీత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తపేటలో లేగదూడల ప్రదర్శన

పెండ్లిమర్రి,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ రమణయ్య ప్రారంభించగా.. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 65 దూడలను ప్రదర్శించారు. దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే మొదటి, రెండు, మూడవ బహుమతులను దూడల యజమానులకు అందజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా రైతులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, డాక్టర్ సురేష్ పశువులలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ ప్రాముఖ్యతను వివరించారు. కడప డీఎల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.1350 ధర నిర్ణయించి... సబ్సిడీ రూ.850 రైతు రూ.500చెల్లిస్తే లింగ నిర్ధారిత వీర్యం అందిస్తోందన్నారు. వాటి ప్రాముఖ్యతను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. డాక్టర్ శరత్ మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భకోశవ్యాధులు, దూడల పెంపకం, లింగనిర్ధారణ వీర్యం వల్ల లాభాలను వివరించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక అధికారి, ప్రదర్శనలో ఉన్న లేగదూడలు

భూ రీసర్వేను పరిశీలించిన ఆర్డీవో



సర్వే జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కడప ఆర్డీవో

సిద్దవటం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండ్ల మూల రెవెన్యూ గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని కడప ఆర్డీవో పి.జాన్‌ఇర్విన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 4 నుంచి ప్రవేశపెట్టిన భూ రీసర్వే కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఏదైనా సమస్యలు ఉంటే సర్వే జరిగిన చోట నిర్ణయాలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ భూమి రైతు పట్టాల భూ రీసర్వే ఎంత విస్తీర్ణం చేశారంటూ ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవిలతను వివరాలు అడిగి సేకరించారు. అనంతరం వీఆర్వోలకు, సర్వేయర్లకు భూ రీసర్వేపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

రామాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి పంచాయతీలోని పొత్తుకూరుపల్లె, బండపల్లి గ్రామాల్లో డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడుతున్నాయన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులను తాపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలు ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్

గాలివీడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు గాలివీడు ఎస్సీ బాలర వసతి గ్రహాలను జిల్లా సాంఘీక సంక్షేమశాఖ సాధికార అధికారి జయప్రకాశ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన వసతి గృహంలోని వంటశాల, తాగునీరు, రికార్డులను పరిశీలించారు. భోజనం, మెనూ పారిశుధ్యం ఇతర సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్లు రవీంద్రనాయక్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి: ఎస్ఐ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఓబులవారిపల్లె, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మహేష్ తెలిపారు. అమృతవారిపల్లె వద్ద హైవే రోడ్డు పక్కన వాహనాల తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించి సక్రమంగా లేని వారికి జరిమానాలు వేశారు. హెల్మెట్ వల్ల ప్రమాదాలు జరిగితే ప్రాణాపాయం లేకుండా బయట పడవచ్చని, తద్వారా కుటుంబం సంతోషంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వల్లి, పెంచలయ్య, బ్రహ్మానందరెడ్డి, రవిశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి ఉత్తీర్ణతా శాతం రావాలి

రైల్వేకోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులకు మంచి ఉత్తీర్ణత శాతం రావాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కే.ప్రసాద్‌వర్మ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు జడ్పీ బాలిక పాఠశాల, బయనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో కెరియర్ గైడెన్స్ మోటివేషన్ క్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బయనపల్లె ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.రామయ్య, మానవత సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేశ్ జన్మదినోత్సవం

- పలుచోట్ల రక్తదాన శిబిరం, అన్నదానం, పుస్తకాల పంపిణీ



రాయచోటిలో రక్తదానం చేస్తున్న అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేటలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ అందజేస్తున్న సుగవాసి

రాజంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో మూడు చోట్ల టీడీపీ ప్రధాన నాయకులు పోటాపోటీగా జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో బీసీ బాలుర వసతి గృహంలో పేద విద్యార్థుల మధ్య లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్‌చేసి, నేతి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు స్టేషనరీ అందజేశారు.

రైల్వేకోడూరులో: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువతకు మార్గదర్శకుడిగా ఉన్నారని జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్‌లు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో మొక్కలు నాటారు. ఆస్పత్రిలో రోగులు, బాలింతలు తదితరులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ముక్కా విశాల్ రెడ్డి, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల కూటమి నేతలు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్‌లో: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకుల ఆశాజ్యోతి నారా లోకేశ్ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలను మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తల నడుమ భారీ కేక్‌కట్ చేశారు.

210 మంది రక్తదానం

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 210 మంది రక్తదానం చేశారు.

ఎట్టకేలకు గుంతల ప్రధానదారికి మోక్షం

- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కడప-రేణిగుంట ప్రధానదారి గుంతలకు మోక్షం కల్గింది. గురువారం రాజంపేట నుంచి రేణిగుంట వరకు గుంతలకు మరమ్మతులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు గుంతల్లోనే ప్రయాణం సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొంతకాలం గుంతల్లోనే ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. ప్రయాణికులు, ప్రజలు, రైతులు, వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం మరమ్మతులకు నిధులు కేటాయించి టెండర్‌కు పిలిచింది. దీంతో పనులు ప్రారంభించారు. ఈ పనులను జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పరిశీలించారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలతో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు.

కార్మికుల కోసం నిరంతర పోరాటం

రైల్వేకోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల కోసం ఏఐటీయూసీ నిరంతరాయంగా పోరాటాలు చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య తెలిపారు. గురువారం జిల్లా మహాసభల గోడపత్రాలను సీపీఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో రైల్వేకోడూరులో సభలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ అలుపెరగని పోరాటాలు చేసిందని, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ప్రభుత్వాలతో పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

రాజంపేటటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రమణ ఆధ్వర్యంలో నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ పట్టణ కార్యదర్శి పెనుగుండ రమణ, ఉపాధ్యక్షులు తోట నగేష్, రేణుప్రసాద్, రమణారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరులో గురువారం నేతాజి సుభాష్‌చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గోశాలదేవి మాట్లాడుతూ నేతాజి దేశానికి చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాంతయ్య పాల్గొన్నారు.

చేతిరాతపై అవగాహన సదస్సు

రాజంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య యూనివర్శిటీలో గురువారం చేతిరాత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టచ్‌టోన్ విభాగం ఆధ్వర్యంలో అసోసియేట్ ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ చేతిరాత ద్వారా వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చన్నారు. చేతి రాత ఒక కల, శాస్త్రం అని పేర్కొన్నారు. చేతిరాత అనేది భావవ్యక్తీకరణకు సాధనమే కాకుండా మన భావాలు, వ్యక్తిత్వ లక్షణాలను ప్రతిబింబించే ఒక అద్దం అన్నారు. ప్రతి అక్షరం ఒక ముద్ర అని పేర్కొన్నారు.

బస్సు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలు

సిద్దవటం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నుంచి కడప వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు సిద్దవటం బాలసూర్య మెడికల్ స్టోర్ వద్ద ఓ వ్యక్తిని బస్సు ఢీకొనడంతో బలమైన గాయాలయ్యాయి. అటవీ శాఖ కార్యాలయంలో కాంట్రాక్టు బేసిక్ కింద విధులు నిర్వహిస్తున్న ప్రొటక్షన్ వాచర్ రమణారెడ్డి(42) రోడ్డు మార్గాన మధ్యాహ్నం 3 గంటల సమయంలో నడుచుకుంటూ వస్తూ ఉండగా బద్వేలు వైపు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. కాగా గాయపడిన వ్యక్తిని స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

అక్రమ ఇంటి నిర్మాణం తొలగింపు

రామాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువు ముందరపల్లె సర్వే నెంబరు 155లో ప్రభుత్వ భూమి నందు అంగన్వాడీ స్కూలు, ఎంపీపీ పాఠశాల కాంపౌండ్ వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా పెద్ద భవనాలు నిర్మించారు. కాగా వీటిపై ఫిర్యాదులు అందడంతో తహసీల్దారు రామాంజనేయులు, ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పరిశీలించి ఎక్సకవేటర్‌తో తొలగించినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధలు అతిక్రమిస్తే చర్యలు తీసు కుంటామన్నారు.

ఏఎస్పీని సత్కరించిన ముస్లిం నాయకులు

రాజంపేటటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను గురువారం ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజంపేట మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ గౌస్‌బాషా, న్యాయవాది ముజఫర్ అహ్మద్, మైనార్టీ నాయకులు జి.వినయతుల్లా, మౌలానా తదితరులు పాల్గొని ఏఎస్పీని సత్కరించారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తత తప్పనిసరి

- పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్



పశువులకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారులు

సుండుపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, మేకల పెంపకం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్థకశాఖ సుండుపల్లె సహాయ సంచాలకుడు డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. గురువారం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను ఏడీ విజయ్‌కుమార్ సందర్శించి పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. దూడలు, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ చాలా ప్రధానమని తెలిపారు. గర్భకోశ వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించి పశువైద్యశాలలకు వచ్చి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, పశుసంవర్థకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి పట్ల అవగాహన అవసరం

చిట్వేలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి పట్ల అవగాహన అవసరమని ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం కుష్ఠువ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్ అన్సారీ మాట్లాడుతూ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి నయం చేయవచ్చన్నారు. ప్రధానంగా విద్యార్థులు కుష్ఠువ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల వారి గ్రామాల్లో అవగాహన కల్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, ఏఎన్ఎం పద్మావతి, ఆశాకార్యకర్తలు కన్యాకుమారి, సుబ్బలక్ష్మీ, ఉపాధ్యాయులు మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైర్ అందజేత



అనాథాశ్రమానికి ప్యూరిఫైర్ మిషన్‌ను అందజేస్తున్న దృశ్యం

రామాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి పంచాయతీ మహావిష్ణు దేవాలయం దగ్గర శ్రీసాయి వెంకయ్యస్వామి కాశిరెడ్డినాయన అనాథాశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫైర్ అందజేసినట్లు అధ్యక్షుడు లయన్ శివారెడ్డి తెలిపారు. కీ.శే. వాసుదేవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు శివశంకర్‌రెడ్డి (నాని) ఆర్థిక సహాయంతో వితరణ చేసినట్లు తెలిపారు. దాత మాట్లాడుతూ తమ తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే వాటర్ ప్యూరిఫైర్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ షేక్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ హరీశ్‌చంద్ర, ఆంజనేయులు, దాత కుటుంబ సభ్యులు చింటు, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణతో గొర్రెల ఆరోగ్యం

- డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య

గాలివీడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నట్టల నివారణ మందులు తాపించడం ద్వారా గొర్రెలు, మేకలు ఆరోగ్యవంతంగా ఉంటాయని జిల్లా పశువైద్య అధికారులు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య పేర్కొన్నారు. ఆయన గురువారం చీమలచెరువుపల్లి పంచాయతీ కమలామర్రిలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందులను తాపించడం ద్వారా గొర్రెల కడుపులో ఉన్న నులిపురుగులు నశించి పోతాయని, తద్వారా అవి ఆరోగ్యవంతంగా తయారవుతాయన్నారు. అనంతరం నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకలకు తాపించారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ ప్రసాద్‌నాయక్, స్థానిక నాయకులు రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న జోనల్ మలేరియా అధికారి

నందలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్‌ను మలేరియాకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ వైద్యులు సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సీహెచ్‌వో వెంకటనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ స్వామిదాస్, జోనల్ ఆఫీస్ ఎంపీహెచ్‌వో నిత్య పూజయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


1200 రక్తనమూనా ట్యూబ్‌ల వితరణ



రక్త నమూనా ట్యూబ్‌లను అందజేస్తున్న సర్పంచ్

నందలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలకు రక్త కణాల నమూనా పరీక్షలు నిర్వహించే 1200 ట్యూబ్‌లను మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, కార్తీక్ విశ్వనాథ్‌లకు గురువారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దాదాపు 6 నెలలకు పైగా రోగులకు ఉపయోగపడతాయని ప్రధానంగా రక్త నమూనా పరీక్షలు, కణాల గుర్తింపునకు ఈ ట్యూబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రోగులకు ఉపయోగపడే విధంగా సహాయపడిన సర్పంచ్ జంబు సూర్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కానకుర్తి వెంకటయ్య, చామంచి పెంచలయ్య, శివకుమార్, పవన్ కుమార్, శివనరసింహులు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో వెంకటనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ఖాదర్‌వలి, ఎంహెచ్ఎన్ శైలజ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వృద్ధుడు

సంబేపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిచెరువు సమీపంలో ఓ బండపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ భక్తవత్సలం గురువారం తెలిపారు. మండల పరిధిలోని చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి సమీపంలోని గంగిరెడ్డిచెరువు దగ్గర బండపై గుర్తు తెలియని వృద్ధుడు (65) శవమై కనిపించినట్లు స్థానికులు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ఆరోగ్యం బాగలేక మృతి చెంది ఉండవచ్చని తెలియజేశారు. మృతుడు బ్లూకలర్ ఫుల్ టీషర్ట్, తెల్లటి గడ్డం కలదని, ఎవరైనా అతని ఆచూకి తెలిపినచో సంబేపల్లె ఎస్ఐ ఫోన్ నెంబర్ 9121100566కు సమాచారం తెలియజేయాలని కోరారు.

గుంతలు పూడ్చాలంటూ కాంగ్రెస్ నేతల నిరసన



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న దృశ్యం

రాజంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై భారీ గుంతలు ఏర్పడడం వల్ల పెద్దఎత్తున ప్రమాదాలు జరిగి అమాయకులు మరణిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కడప- చెన్నై జాతీయ రహదారిలో ఏర్పడ్డ గుంతల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారంటూ హైవేరోడ్డుపై గురువారం ఆందోళన నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కోఆర్డినేటర్ పూల భాస్కర్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వెనువెంటనే ఈ రోడ్లలో ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని పేర్కొంటూ గుంతల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జెండాలు చేతబట్టి హైవేరోడ్డుకు అడ్డంగా నిలబడి రోడ్డుపై పడ్డ గుంతల వద్ద పూల మొక్కలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్, అబ్దుల్లా, నాగూర్, సుధాకర్, రసూల్, మహ్మద్‌అలీ, యాసీన్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం వద్ద కోళ్ల ఫారం తొలగించాలి

- దుర్వాసనతో అల్లాడుతున్నామంటూ గ్రామస్థుల నిరసన

గాలివీడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న కోళ్ల ఫారం నుంచి వెలవడే వ్యర్థాలు, దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నామని, వెంటనే కోళ్ల ఫారం తొలగించాలంటూ గ్రామస్థులు, విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం మండలంలోని గ్రామ సచివాలయం, ప్రధాన రహదారిపైన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రం భవనాన్ని కొందరు తమ స్వలాభం కోసం మూత వేయించి పక్కనే కోళ్ల ఫారాన్ని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఇదే విషయమై ఇప్పటికే పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, మండల ప్రజా పరిషత్ అధికారి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి బహూకరణ

నందలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 43 మంది విద్యార్థులు విశ్రాంత ఉపాధ్యాయులు అనుపల్లి పుల్లయ్య కుమారుడు వరప్రసాద్ గురువారం పరీక్ష సామగ్రి బహూకరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత మార్కులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవిలతతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ రెడ్డి, సుష్మిత, సుదర్శన్, రాజు, షఫీ, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న: సీఐ

చిట్వేలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లోకెల్లా రక్తదానం మిన్న అని, రక్తదాతలు ప్రాణదాతలు అవుతారని రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నెల 26న రిపబ్లిక్‌డే సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. గురువారం అనుమతి పత్రాన్ని సీఐ, ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ సంస్థ కార్యవర్గ సభ్యులు ఎం.భాస్కర్‌రెడ్డి, బి.శివ, నాగేశ్వరరావు, జి.ఇంతియాజ్‌అహ్మద్, పెంచలయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా ఉన్న వేపచెట్టు తొలగింపు

రైల్వేకోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ రూటులో చిన్న దర్గా వద్ద గత కొంత కాలంగా వేపచెట్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ మేరకు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని గ్రామ ప్రజలు భయాందోళన చెందారు. ఈ విషయం టీడీపీ యువ నాయకుడు సాయివికాస్‌రెడ్డికి విన్నవించారు. ఆయన గురువారం కూలేందుకు సిద్ధంగా ఉన్న వేపచెట్టును యంత్రంతో తొలగింపజేశారు.

మళ్లీ తెరపైకి డిటెన్షన్.?!

- విద్యార్థులు పాసైతేనే పైచదువులకు
- ఇకపై 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం
- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టానికి సవరణ
- ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు



కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిటెన్షన్ విధానం మళ్లీ తెరపైకి వచ్చింది. పాఠశాల స్థాయిలో 5, 8 తరగతుల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే పైతరగతులకు పంపించే డిటెన్షన్ పాలసీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిటెన్షన్ అమలుతోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగి పైచదువుల్లో రాణిస్తారని కేంద్రం ఆలోచన చేస్తోంది. ఈ విధానం ప్రైవేట్ పాఠశాలలకు లబ్ధి చేకూరుస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర క్యాబినెట్‌లో కూడా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో డిటెన్షన్ విధానంపై ప్రత్యేక కథనం..

కేంద్ర ప్రభుత్వం పిల్లల ఉచిత నిర్బంధ విద్యాచట్టం-2010కి సవరణలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. మారిన నిబంధనలను పిల్లల ఉచిత మరియు నిర్బంధ విద్య (సవరణ) నియమాలు-2024 అని పిలుస్తారు. తాజా సవరణ నిబంధనల ప్రకారం 5, 8 తరగతుల్లో విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని పిల్లలను అదే తరగతులకు డిటైన్ చేస్తారు. అంటే పై తరగతికి పంపించరు. ఫలితాల ప్రకటన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలో విద్యార్థులకు తిరిగి పునఃపరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారిని మాత్రమే పై తరగతులకు ఉన్నతీకరిస్తారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను కూడా చైతన్యపరచాల్సి ఉంటుంది. ఆ పాఠశాల అధిపతి వెనుకబడిన విద్యార్థుల జాబితాలు తయారు చేసుకుని వ్యక్తిగతంగా వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పరీక్ష మరియు పునఃపరిశీలన అనేది పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధించడానికి సామర్థ్య ఆధారిత పరీక్షలుగానే ఉండాలి కానీ కంఠస్థం మరియు విధానపరమైన నైపుణ్యాలపై ఆధారపడి ఉండకూడదని తాజా సవరణ ఉత్తర్వుల్లో కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. దీనికై కేంద్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. దీనితో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూల్లో మరియు ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆధీనంలో పనిచేస్తున్న బడుల్లో కొత్త డిటెన్షన్ విధానం అమల్లోకి వస్తుంది. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వాలకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ప్రకారం అమలు పరచడంలో ఆప్షనల్‌గా నిర్ణయించుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నందున అమలుపరిచే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

1970 వరకు డిటెన్షన్ విధానం

ఉమ్మడి రాష్ట్రంలో 1970 వరకు ప్రాథమిక విద్యలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేది. విద్యార్థులు బడులకు దూరంగా ఉండేవారు. అప్పటి వరకు డిటెన్షన్ విధానం అమల్లో ఉండేది. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు, మధ్యలో బడి మానేసే పిల్లల సంఖ్య (డ్రాపౌట్స్)ను తగ్గించేందుకు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో 7, 10 తరగతులను మినహాయించి మిగిలిన తరగతులకు 1971లో నాన్‌డిటెన్షన్ (పరీక్షలతో సంబంధం లేకుండా పైతరగతికి పంపడం) విధానాన్ని ప్రవేశపెట్టారు.

పరీక్షలు ఒక్కటే ముఖ్యం కాదు

ఏడో తరగతి తర్వాత పైతరగతికి వెళ్లాలంటే కామన్ ఎగ్జామ్స్ విధానాన్ని 1971 నుంచే అమలు చేశారు. గణిత, సైన్స్, ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా చూడాలన్న లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే పాఠ్యాంశాల బోధనకు తగినట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోను పరీక్షల నిర్వహణ ఓ పార్సుగా మారింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్ని ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. దీనివల్ల పరిస్థితులు విషమిస్తున్నాయన్న ఉద్దేశంతో 7వ తరగతిలో కామన్ పరీక్షల విధానానికి 2008లో విద్యాశాఖ స్వస్తి చెప్పింది. ఈ నేపథ్యంలో ఎక్కువమంది డిటెన్షన్ విధానం వద్దని అభిప్రాయపడుతున్నారు. నాన్ డిటెన్షన్ విధానం వలన పిల్లలు ఏటా పై తరగతికి వెళ్తుండడంతో డ్రాపౌట్స్ శాతం క్రమంగా తగ్గింది. అక్షరాస్యత పెరుగుతూ వస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పించి ఇతర పనుల్లో పెట్టకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడుతోంది. విద్యార్థుల్లో పరీక్షల భయం తగ్గింది.

బడుగు బలహీన వర్గాల పిల్లలు పాఠశాలలకు రావడం క్రమేణా పెరిగింది. బాలికల్లో అక్షరాస్యత సైతం నాన్ డిటెన్షన్ విధానం వల్లనే సాధ్యమైందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే.. డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తే విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో బాధ్యత పెరుగుతుందని, ఉపాధ్యాయులు శ్రద్ధతో బోధన చేస్తారనే వాదనా వినిపిస్తోంది. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని, ఉన్నత విద్యలోను రాణిస్తారని అంటున్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో కానీ.. పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు మాత్రం 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం వద్దనే అంటున్నారు.

డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి



కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 5, 8 తరగతుల డిటెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య పిల్లలకు అందాలంటే 9వ తరగతి వరకు నాన్ డిటెన్షన్ విధానం మాత్రమే ఉండాలి. 10వ తరగతి నుంచి మాత్రమే డిటెన్షన్ విధానం అమలు చేయాలి. లేకుంటే డ్రాపౌట్ల శాతం పెరుగుతుంది. ఉచిత నిర్బంధ విద్యకు తూట్లుపడతాయి. ఒక వేళ తప్పదు అనుకుంటే 8వ తరగతికి మాత్రమే డిటెన్షన్ విధానాన్ని ఆలోచించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

సమర్థనీయం కాదు



బాలలందరికి ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యను అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. డిటెన్షన్ విధానం వలన గ్రామీణ ప్రాంతాలలో డ్రాపౌట్ శాతం పెరిగే అవకాశం ఉంది. గతంలో 7వ తరగతికి సంబంధించి కామన్ పరీక్షలు ఉన్న విషయం మనకు తెలిసిందే. కానీ ఆచరణలో అది సరైన రీతిలో ఫలితాలను ఇవ్వలేకపోవడం వలన దానిని తీసివేయాల్సి వచ్చింది. కావున డిటెన్షన్ విధానమనేది 10వ తరగతి వరకు వాంఛనీయం కాదు.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

నో డిటెన్షన్ విధానాన్నే కొనసాగించాలి



తప్పనిసరిగా 5వ, 8వ తరగతిలోని విద్యార్థులు వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాస్ కాలేక, బడికి రాకుండా డ్రాపౌట్‌గా మిగిలే అవకాశం ఉంటుంది.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సరైన అవగాహన లేక, విద్యార్థులు ఉత్తీర్ణత కాలేక, ఒత్తిడి వలన పాఠశాలకు దూరమయ్యే అవకాశం ఉంది. విద్య అనేది రాష్ట్ర పరిధిలోని అంశం కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు అమలులో ఉన్న నోడిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.

-ఎస్.రామాంజనేయులు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

డిటెన్షన్ విధానం ఉండాల్సిందే



ప్రస్తుత పరిస్థితుల్లో డిటెన్షన్ విధానం ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి, బోధన నైపుణ్యాలు పెంపొందించాలంటే డిటెన్షన్ విధానం అవసరం. గతంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండడం వలన నిరక్షరాస్యత రేటు తగ్గించాలనే ఉద్దేశంతో నాన్ డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం విద్య గురించి తల్లిదండ్రులందరిలో అవగాహన పెరిగింది. ప్రతి తల్లితండ్రి నాణ్యమైన విద్య కావాలని కోరుకుంటున్నారు. కాబట్టి డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నాం.

- లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

డిటెన్షన్ విధానం వద్దు



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 5వ తరగతి, 8వ తరగతి విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రకటన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. గతంలో అనేక మందితో చర్చించిన పిదప 7వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్ రద్దు చేశారు. మరిప్పుడు 5వ, 8వ తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానం ఎందుకు? దీని వెనక బడుగు బలహీన పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర దాగి ఉంది. డిటెన్షన్ విధానం అమలు ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- బి.లక్ష్మీరాజా, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

కేఎంసీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర మునిసిపల్ మైదానంలో గురువారం కేఎంసీ స్పోర్ట్స్ మీట్‌ను కడప నగర పాలక కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో 100, 400, 4 ఇంటూ 400 రన్నింగ్‌తో పాటు వాలీబాల్ పోటీలను వివిధ పాఠశాలల బాల, బాలికలకు నిర్వహించారు.

100 మీటర్ల బాలికల విభాగంలో... : 100 మీటర్ల బాలికల విభాగంలో ప్రథమస్థానం ఎం.శ్రీలతారెడ్డి (ప్రభుత్వ బాలికల పాఠశాల, కడప), ద్వితీయ స్థానం వేద వర్షిణి (స్పోర్ట్స్ స్కూల్), తృతీయస్థానం జె.కీర్తన (అంబేడ్కర్ స్కూల్) నిలిచారు.

బాలుర విభాగంలో... : 100 మీటర్ల బాలుర విభాగంలో బి.రాముడు (స్పోర్ట్స్ స్కూల్) ప్రథమస్థానం, జె.తిమోతి (గాంధీనగర్ స్కూల్) ద్వితీయ స్థానం, ఎల్.జస్వంత్‌రెడ్డి (కడపస్కూల్), తృతీయస్థానం సాధించారు

400 మీటర్ల రిలే పరుగులో... : 400 మీటర్ల రిలే పరుగులో విద్యామందిర్ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలువగా, ద్వితీయ స్థానం సాల నాగయ్య (మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్), తృతీయ స్థానం నాగరాజుపేట మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు సాధించారు.

వాలీబాల్ విభాగంలో... : వాలీబాల్ పోటీలలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించగా, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ అగాడి విద్యార్థులు ద్వితీయస్థానం, మున్సిపల్ మెయిన్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు.

నేడు బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు : స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 24వ తేదీ శుక్రవారం ఉదయం కబడ్డీతో పాటు బ్యాడ్మింటర్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



పరుగు పందెంలో బాలికలు

కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కురబ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శ్రీరామతులసి కల్యాణ మండపంలో భక్త శ్రేష్ఠ కనకదాస్ 537వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కురబ సంఘ ప్రతినిధులు, కార్పొరేట్ డైరెక్టర్లు, కురబ కులస్థులు పాల్గొన్నారు. ముందుగా కనకదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో కురబలు రాజకీయాల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నపటికీ రాజకీయంగా కురబలకు న్యాయం జరగడం లేదన్నారు. కురబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ముందుకు రావాలన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చైతన్య యాత్రలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 2వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పం నుంచి యాత్రలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుమల పుణ్యక్షేత్రంలో ఇతర కులాలకు కేటాయించిన విధంగా కురబల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలన్నారు. టీటీడీ, శ్రీశైలం దేవస్థానాల్లో కమిటీల్లో కురబలకు అవకాశం కల్పించాలన్నారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల లోన్లు కురబ కులస్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన ప్రజాప్రతినిధులను, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లకు జ్ఞాపికలు అందించి సన్మానించారు. అనంతరం ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో మూడోసారీ రాష్ట్ర అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురబ యువత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తలపల్లె కోటి సురేశ్, యూత్ అధ్యక్షుడిగా కాటమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, లింగమూర్తి, విఠల్ గౌడ్, దండు కేశవ, కప్పల అనిల్, రిటైర్డ్ డీఎస్పీ పోతప్ప, జంజుడప్ప, సుధాకర్, ఈశ్వరయ్య, మురళి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు వలిగట్ల వెంకటరమణ, పరిమళ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు పండగే

- ఆర్థిక సంఘం నిధులు రూ.87.22 లక్షలు విడుదల
- గత ప్రభుత్వంలో నిధులు దారి మళ్లించిన వైనం
- సక్రమంగా వినియోగిస్తే పంచాయతీలకు మహర్దశ



తిమ్మసముద్రం, జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాలు

సుండుపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు కూటమి సర్కారు చొరవతో మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా పురిపుష్టిని సంతరించుకోనున్నాయి. సుండుపల్లె మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మండలంలో 10 గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరిగాయి. సర్పంచులు కొలువుదీరిన తరువాత అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు. నిధుల లేమితో పంచాయతీల్లో లైట్లు సైతం మార్చలేని స్థితిలోకి వెళ్లాయి. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచులను పూర్తిగా కీలుబొమ్మలుగా మార్చారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించింది. దీంతో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడాయి. గ్రామ పంచాయతీల్లో కనీసం ప్రజలకు తాగు నీరు సైతం అందించలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే పంచాయతీలకు మంచిరోజులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధు లు విడుదల చేసి పంచాయతీలను ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు కేంద్రం చొరవతో కూటమి సర్కారు తొలి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది.

మండలానికి రూ.87.22 లక్షలు

మారుమూల సుండుపల్లె మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే సుండుపల్లె, ఈడిగపల్లె, సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీలకు సర్పంచు ఎన్నికలు జరగలేదు. పలు సమస్యలపై స్థానికులు కోర్టుకు వెళ్లడంతో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన భాగంపల్లె గ్రామానికి రూ.4,62,908, చిన్న గొల్లపల్లెకు రూ5,60,892, మాచిరెడ్డిగారిపల్లెకు రూ.7,44,783, మడితాడుకు రూ.18,24,703, ముదుంపాడుకు రూ.9,69,009, పొలిమేరపల్లెకు రూ.5,22,621, తిమ్మసముద్రానికి రూ.10,56,460, పెద్దినేనికాలువకు రూ.9,85,125, జి.రెడ్డివారిపల్లెకు రూ5,25,328, రాయవరానికి రూ.10,70,412 చొప్పున 10 గ్రామాలకు కలిపి రూ.87,22,241 నిధులు గ్రామ పంచాయతీ అకౌంటుకు జమ కావడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ నిధులతో గ్రామాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు పడనున్నాయి.

దారి మళ్లించిన వైసీపీ సర్కారు

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను ఖాతాల్లోకి రాగానే దారి మళ్లించడంతో సర్పంచులు ఏం చేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. ప్రస్తుత కూటమి సర్కారు కేంద్ర ప్రభుత్వం చొరవతో నేరుగా పంచాయతీల ఖాతాలకే కేటాయించింది. దీంతో నిధులు పక్కదారి పట్టే అవకాశం లేకుండా పోయింది.

పంచాయతీలకు ఎంత నిధులొచ్చాయి అనే విషయాలను సర్పంచులు తెలుసుకునే వెసులుబాటు కలిగింది. మండలంలో పది పంచాయతీలకు టైడ్‌గ్రాంట్‌గా రూ.50,95,529 లక్షలు, అనైడ్ నిధులుగా రూ.36,26,712 లక్షలు మొత్తంగా రూ.87,22,241 లక్షలు మంజూరయ్యాయి.

అభివృద్ధి వైపు అడుగులు వేస్తాం



ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడవకముందే పంచాయతీలకు నిధులు విడుదల చేయడం సంతోషదాయకం. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు వినియోగిస్తాము. గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈ నగదు దోహదపడుతుంది. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

-మహమ్మద్ షరీఫ్, సర్పంచ్, రాయవరం

నిధులు సక్రమంగా వినియోగించాలి

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చూస్తాము. గ్రామ పంచాయతీలో ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలి. తాగునీటి సమస్యలు లేకుండా చేస్తాము. నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తాము. ప్రతి రూపాయి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి.

-సురేశ్‌బాబు, ఈవోపీఆర్‌డీ, సుండుపల్లె

మదనపల్లెవాసికి
ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం



ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారంతో సురేశ్

మదనపల్లె అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన యూత్ కరాటే క్లబ్ అధ్యక్షుడు ఏఆర్ సురేశ్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అందుకున్నారు. గురువారం హైదరాబాదులోని భాస్కర ఆడిటోరియంలో మాస్టర్ కేశవ కరాటే అకాడమీ ఇండియా వారి ఆధ్వర్యంలో పురస్కారం అందించారు. కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి వారి ప్రతిభతో పాటు సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందులకు ఈ పురస్కారం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కేశవ అకాడమీ అధ్యక్షుడు కేశవగౌడ్ మాట్లాడుతూ కరాటే వృత్తిలోనే కాకుండా తోటి మాస్టర్లు ఇబ్బందుల్లో ఉంటే వారికి ఆర్థికసాయం అందించడంలో ఏఆర్ సురేష్‌కు సాటి లేరన్నారు. కార్యక్రమంలో శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, లండన్, సౌదీ అరేబియా తదితర దేశాలతో పాటు 12 రాష్ట్రాల మాస్టర్లు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

అయినా... తీరు మారడం లేదు

- మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..
- జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు
- అయినా కొందరిలో మార్పు అంతంతమాత్రమే
- 13 నెలల్లో 1430 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడటమే కాకుండా.. ఇతరుల ప్రాణాలను బలిగొంటున్నారు. ఇక యువత మద్యం మత్తులో ఇష్టానుసారం వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో పోలీసులు మందుబాబులపై ప్రత్యేక నిఘా పెట్టి జరిమానాలు వేసి జైలుకు పంపుతున్నప్పటికీ కొందరి తీరు మారడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసులు కడప జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి 13 నెలల్లో 1430 మందిపై కేసులు నమోదు చేశారు.


బ్రీతింగ్ ఎనలైజరుతో తనిఖీ చేస్తున్న పోలీసులు

మద్యం తాగి జైలుకెళ్లిన సందర్భాలెన్నో....

కడపకు చెందిన ఓ ఆటోడ్రైవరు మద్యం తాగి వాహనం నడుపుతూ నాలుగు నెలల క్రితం పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ డ్రైవరుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడంతో రూ.10వేలు జరిమానాతో పాటు 30 రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే కడపకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా అతనికి 15 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3వేలకు పైగానే జరిమానా విధించారు. ఓ కారు డ్రైవరు మద్యం తాగి వాహనం నడుపుతుండగా నగర శివార్లలో అతన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. వారం రోజులు జైలుశిక్ష వేసి జరిమానా విధిం చారు. ప్రస్తుతం ఎవరైనా మద్యం తాగి పట్టుబడితే వారికి కోర్టు రూ.10వేలు నుంచి నెలరోజుల పాటు జైలుశిక్ష వేయనున్నారు.

వాహనాల్లోనే బార్లు, మద్యం షాపులకు...

మద్యం తాగేందుకు యువతతో పాటు కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, డ్రైవర్లు, స్నేహితులతో కలిసి బార్లు, మద్యం షాపులకు వాహనాల్లో వెళుతున్నారు. బ్యాచ్‌లతో వెళుతున్న వీరు ఫుల్‌గా మద్యం సేవించి.. తాగిన మత్తులోనే వాహనాలను నడు పుతూ ప్రమాదాలకు గురవతున్నారు. మరికొందరు ఎదుటి వారిని ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారు.

నగర శివార్లలో.. మందుబాబుల తిష్ట

మద్యం షాపులలో మద్యం కొనుగోలు చేసి అక్కడ తాగే అవకాశం లేకపోవడంతో నగర శివార్లకు వెళ్లి అక్కడ ఓపెన్ ప్లేస్‌లో సిట్టింగ్ వేస్తారు. సరదాగా స్నేహితులతో కలిసి పీకల్లోతు మద్యం సేవించి ఆ మత్తులో వాహనాలు నడుతూ తరచూ ప్రమాదాలకు గురవతున్నారు. దీంతో గతంలో పనిచేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నగర శివార్లలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో మందుబాబుల ఆగడాలు కాస్త సద్దుమణిగాయి. అయితే పోలీసుల నిఘా కొరవడటంతో ఇటీవల కొంత మంది యువత నగర శివార్లలో కొన్ని ప్రాంతా లను ఎంచుకుని వాహనాల్లో మద్యం తీసుకెళ్లి అక్కడ యథేచ్ఛగా తాగుతూ తూలుతుంటారు.

మందుబాబులపైనే పోలీసుల గురి

రాత్రివేళల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. నగర శివార్లతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద బ్రీతింగ్ ఎనలైజర్లతో తనిఖీలు చేపట్టి మందుబా బులను పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఈ 13 నెలల్లోనే 12,030 కేసులు కేసులు నమోదు కాగా మద్యం మత్తులో కాకుండా రాత్రుళ్లు తనిఖీల సమయంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న 1422 మందిపై కేసులు నమోదు చేశారు. ఇకపై కూడా కడప డీఎస్పీ వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో మందుబాబులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరంగానే కఠినంగా శిక్షించాలని నిర్ణయించారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. మద్యం తాగి పదే పదే పట్టుబడితే ఉపేక్షించేది లేదు. లైసెన్సు రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి పగలు అన్నివేళలా బ్రీతింగ్ ఎనలైజరుతో పరీక్షలు నిర్వహిస్తాం. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట నిలబెడతాం. కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపిస్తాం.

-జావీద్, కడప ట్రాఫిక్ సీఐ

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

సికెదిన్నె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, రమాదేవి, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ రీసర్వేను పరిశీలించిన ఆర్డీవో


సర్వే జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కడప ఆర్డీవో

సిద్దవటం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండ్లమూల రెవెన్యూ గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని కడప ఆర్డీవో పి.జాన్‌ఇర్విన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 4 నుంచి ప్రవేశపెట్టిన భూ రీసర్వే కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఏదైనా సమస్యలు ఉంటే సర్వే జరిగిన చోట నిర్ణయాలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ భూమి రైతు పట్టాల భూ రీసర్వే ఎంత విస్తీర్ణం చేశారంటూ ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవిలతను వివరాలు అడిగి సేకరించారు. అనంతరం వీఆర్వోలకు, సర్వేయర్లకు భూ రీసర్వేపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీ - వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బద్వేల్ రోడ్డులో మోటర్ బైక్‌పై వెళుతున్న కంచర్ల సంటెయ్య (35)ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. ఎన్.ఎర్రబల్లె వాసి కంచర్ల సంటెయ్య వృత్తి రిత్యా ఫొటోగ్రాఫర్. మైదుకూరులోని ఓ ఫొటో స్టూడియోలో పనిచేసి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంటెయ్యకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారు పుట్టుకతో దివ్యాంగులని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన సి.మునిరెడ్డి (73) ప్రస్తుతం కడప కోఆపరేటివ్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య ంతో పాటు ఇతర సమస్యలతో బాధపడుతుండేవారు. గురువారం రామాంజనేయపురంలోని చర్చి వద్ద కూర్చుని మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చక్రాయపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిక్షేత్రం సమీపాన గురువారం ఆటో, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వడ్డెపల్లె గ్రామానికి చెందిన కొందరు ఆటోలో వేంపల్లెకు వెళ్తుండగా.. వేంపల్లె నుంచి బైకులో ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. గండికి సమీపంలోని పెద్దగుండు వద్ద కు రాగానే ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొ నడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడి ప్రహరీగోడను ఆనుకుంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకపోతే పది మట్ల లోతులో పడిపోయేది. ఈప్రమాదంలో వెంకటేష్, వెంకటసుబ్బమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ముగ్గురు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఫేక్ డాక్యుమెంట్లతో వ్యవసాయ రుణాలు.. వ్యక్తి అరెస్టు


నిందితుని చూపుతున్న పోలీసులు

కమలాపురం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫేక్ డాక్యుమెంటు సృష్టించి వ్యవసాయ రుణాలు పొంది బ్యాంకులను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామానికి చెందిన మూల నాగేశ్వర్‌రెడ్డి దొంగ డాక్యుమెంటు సృష్టించి పంట రుణాలు పొందినట్లు సమాచారం రావడంతో కడప ఎస్‌డీపీవో వెంకటేశ్వర్లు, కమలాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టరు షేక్ రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి విచారణ చేపట్టారు. గురువారం గ్రామ సమీపంలో నిందితుడు ఉన్నట్లు తెలియరావడంతో తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఫేక్ డాక్యుమెంట్లను స్వాధీనపరుచుకుని రిమాండుకు తరలించారు. కాగా, గతంలో కమలాపురం ఎమ్మార్వో ఆఫీసులో యల్లారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ వీఆర్వోగా విధులను నిర్వర్తించిన అంజి అలియాస్ రామాంజి డీకేటి భూములు, కొండలు, గుట్టలు ఇతర భూములకు సంబంధించి నాగేశ్వర్‌రెడ్డితో కలిసి ఫేక్ డాక్యుమెంటులను తయారు చేశారు. వాటి ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను మ్యుటేషన్ చేసి ఫేక్ డాక్యుమెంట్ల సృష్టించి బ్యాంకుల నుంచి ఎక్కువ మొత్తంలో క్రాప్‌లోన్లను పొంది.. ఆ డబ్బును పంచుకున్నారు. కమలాపురం మండలం, యల్లారెడ్డిపల్లె పంచాయతీలోని సర్వే నెం.645లో గల గండి సుబ్బలక్షుమ్మ అనే రైతుకు చెందిన భూమి రికార్డులను ఫేక్ డాక్యుమెంట్‌ల ద్వారా తమకు అనుకూలంగా మ్యుటేషన్ చేసుకుని ప్రొద్దుటూరు టౌన్‌లో గల కెనరా బ్యాంకు నుంచి క్రాప్ లోను ద్వారా రూ.2.50 లక్షలు తీసుకున్నారు. ఆ డబ్బులను తమ సొంతానికి వాడుకుని.. తిరిగి చెల్లించలేదన్నారు. ఇందుకు పాత్రులైన ఇంకా కొంత మంది ఉన్నారని వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు.

ఏఆర్ సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్


ఫైరింగ్ ప్రాక్టీసులో పోలీసు సిబ్బంది

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఏఆర్ పోలీసులకు గురువారం ఫైరింగ్ ప్రాక్టీసు చేయించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య పర్యవేక్షణలో నగర శివారులోని ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ పోలీసులకు వివిధ రకాల తుపాకులతో ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. మొబలైజేషన్‌లో భాగంగా వార్షిక ఫైరింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి వృత్తి నైపుణ్యం పెంచుకుందామని సూచించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు సిబ్బందికి ఫైరింగ్‌లో మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిపై వన్‌టౌన్ సీఐ దాడి

- కోర్టులో జడ్జికి బాధితుడి ఫిర్యాదు
- సీఐకి షోకాజ్ నోటీసులు ఇచ్చిన మేజిస్ట్రేట్

ప్రొద్దుటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో అరెస్టు అయిన నిందితుడిని ఒన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి స్టేషన్లో చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిందితుడు కోర్టులో జడ్జి ఎదుట తనపై సీఐ దాడిచేసిన విషయం వెల్లడించి.. గాయాలు చూపించడంతో సీఐకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... కేహెచ్‌ఎం వీధికి చెందిన హనీఫ్ తన తల్లిదండ్రులతో గొడవపడుతూ వారిని వేధించేవాడు. సుందరాచార్యుల వీధికి చెందిన మమ్మద్ అలీఖాన్ జనవరి 19న హనీఫ్ తీరును ప్రశ్నించాడు. దీంతో నీవేంది నాకు చెప్పేది అని మమ్మద్ ఖాన్‌పై హనీఫ్ దాడిచేశాడు. ఈ దాడిలో మహ్మద్‌ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. మహ్మద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనీఫ్‌ను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఫస్ట్ ఏడీఎం కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచగా తనపై ఒన్ టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి దాడిచేసి కొట్టాడని వీపుపై వున్న రక్తగాయాలను మేజిస్ట్రేట్‌కు చూపించాడు. దీనిపై సీఐని వివరణ ఇవ్వాలని గురువారం మేజిస్ట్రేజ్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనిపై సీఐని వివరణ కోరగా షోకాజ్ నోటీసు ఇచ్చింది వాస్తవం అని తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ మ్యాచ్‌లు


కడప స్పోర్ట్స్, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 25వ తేదీ శనివారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం వరకు క్రికెట్ దిగ్గజం కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ రాష్ట్రస్థాయి నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు (రెండు-మ్యాచ్‌లు) నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. ఇందులో ఆంధ్ర, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ జట్లు తలపడనున్నాయన్నారు. ఆమేరకు ఈనెల 25 నుంచి 28 వరకు ఆంధ్ర-పంజాబ్ జట్ల మధ్య పోటీలు సాగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4 వరకు జరుగనున్న రెండో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు హిమాచల్‌ప్రదేశ్ జట్టుతో తలపడుతుందన్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్ర జట్ల క్రీడాకారులు కడపకు చేరుకుని సంబంధిత ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రాక్టీస్ షెషన్‌లో నిమగ్నమయ్యారు. కాగా మ్యాచ్ నిర్వహించేందుకు అనువుగా క్రికెట్ మైదానాన్ని మార్కింగ్‌తో సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ జీవనశైలితో ప్రభావవంతమైన సమాజం : వీసీ


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడ ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ జీవన శైలితో మానసిక ఆరోగ్యం కాంతులీని ప్రభావవంతమైన సమాజం ఏర్పడుతుందని వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. తమిళనాడు పెరంబుదూర్‌లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ భారత ప్రభుత్వ పార్లమెంట్ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వైవీయూ ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంపై (యూత్ మెంటర్ హెల్త్ ప్రమోషన్‌పై టీటీపీ ప్రోగ్రాం)పై శిక్షకుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. మాట్లాడుతూ సమాజంలోని ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత భేదాలు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ఇంటర్‌నెట్‌లో ఎక్కువటైం గడపడం వలన అనేక మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రతిరోజు కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లకు సమయం కేటాయించాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్ డాక్టర్ ఝాన్సిరాణి, డాక్టర్ లలిత, డాక్టర్ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

ఈఎఫ్ఏయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ 5,7,3 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ఫలితాలు విడుదల చేసేందుకు కృషిచేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి జి.ఫణేంద్రరెడ్డి, సహాయ అధికారి ఉదయప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి, వి.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై వైవీయులో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అన్నారు. మహిళలను గౌరవించడం ద్వారా పని వాతావరణం పెరిగి మంచి ఫలితాలు వస్తాయన్నారు. న్యాయవాదులు ఎస్.పర్వీన్ నాజ్, జి.ఉమ, సైకాలజిస్ట్ సునీత వర్క్‌ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపులు చట్టంపై అవగాహన కల్పించారు. సఖి, వన్‌స్టాప్ సెంటర్ సునీత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తత తప్పనిసరి

- పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్

సుండుపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, మేకల పెంపకం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధకశాఖ సుండుపల్లె సహాయ సంచాలకుడు డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. గురువారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను ఏడీ విజయ్‌కుమార్ సందర్శించి పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. దూడలు, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ చాలా ప్రధానమని తెలిపారు. గర్భకోశ వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించి పశువైద్యశాలలకు వచ్చి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నతోటలో ఘర్షణ... నలుగురికి గాయాలు

జమ్మలమడుగు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని నాగలక్షుమ్మ ఇంటిపై రోశమ్మ కుమారుడు శివక్రిష్ణ, అతని భార్య సుకన్య దాడి చేశారు. పోతనబోయిన నాగలక్షుమ్మ ఇంట్లో వేపచెట్టు ఉంది. ఆ వేపచెట్టుపై ఇంటి పక్కనే ఉన్న రోశమ్మ కోళ్లు చేరి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని నాగలక్షుమ్మ రోశమ్మకు చెప్పింది. దీంతో పాతకక్షలతో దాన్ని దృష్టిలోఉంచుకుని రోశమ్మ కుమారుడు శివక్రిష్ణ, అతని భార్య సుకన్య రాళ్లు, కర్రలతో నాగలక్షుమ్మ ఇంటిపై దాడి చేశారు. ఇందులో నాగలక్షుమ్మ, భర్త నారాయణ, కోడలు గంగాదేవి, కుమారుడు నారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రామక్రిష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు బోల్తా - ఇద్దరికి గాయాలు

ముద్దనూరు జనవరి23(ఆంధ్రజ్యోతి): కడప- తాడిపత్రి హైవేపై కొత్త చౌటిపల్లె వద్ద గురువారం మధ్యాహ్నం కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు... అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వారు రాయచోటిలో చదువుతున్న బంధువుల అబ్బాయిని హాస్టల్‌లో విడిచి వస్తున్నారు. చౌటిపల్లె దాటగా నే కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న వేణుమాధవ్, రవితేజకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆటోలో ముద్దనూరులోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు.

కొత్తపేటలో లేగదూడల ప్రదర్శన



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక అధికారి, ప్రదర్శనలో ఉన్న లేగదూడలు

పెండ్లిమర్రి,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ రమణయ్య ప్రారంభించగా.. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 65 దూడలను ప్రదర్శించారు. దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే మొదటి, రెండు, మూడవ బహుమతులను దూడల యజమానులకు అందజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా రైతులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, డాక్టర్ సురేష్ పశువులలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ ప్రాముఖ్యతను వివరించారు. కడప డీఎల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.1350 ధర నిర్ణయించి... సబ్సిడీ రూ.850 రైతు రూ.500చెల్లిస్తే లింగ నిర్ధారిత వీర్యం అందిస్తోందన్నారు. వాటి ప్రాముఖ్యతను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. డాక్టర్ శరత్ మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భకోశవ్యాధులు, దూడల పెంపకం, లింగనిర్ధారణ వీర్యం వల్ల లాభాలను వివరించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో ఫ్లెక్సీలు, బ్యానర్ల చించివేత వివాదం

మదనపల్లె టౌన్/తంబళ్లపల్లె/బి.కొత్తకోట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లను ధ్వంసం చేసి చించివేత వివాదం టీడీపీ శ్రేణులను కలవరపాటుకు గురిచేసింది. టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి వర్గీయుల అరాచకంపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నామని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా టీడీపీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు నటరాజునాయక్ పేర్కొన్నారు. గురువారం మదనపల్లె పట్టణం సొసైటీ కాలనీలో వారు విలేకర్లతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎనిమిది రోజులు యువగళం పాదయాత్ర చేసిన లోకేశ్‌కు గుర్తుగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తు లోకేశ్ జన్మదినవేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె మండల కేంద్రాల్లో లోకేశ్ ఫ్లెక్సీబ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇది గిట్టని జయచంద్రారెడ్డి వర్గీయులు మూడు చోట్ల తాము ఏర్పాటు చేసిన బ్యానర్లను చించేసి, ధ్వంసం చేశారన్నారు. అంతే కాకుండా కేకులను తరలిస్తుంటే వాటిని కింద పడేసి కాళ్లతో తొక్కేసి నాశనం చేశారన్నారు. ఈ విషయాలన్నింటిపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కాగా టీడీపీ బీసీ నాయకుడు పురుషోత్తం, పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సోము, వీరాంజినేయులు, నరసింహులు, గంగరాజు, నాందిరెడ్డప్ప, రామలింగారెడ్డి, బాలక్రిష్టారెడ్డి, మాజీ వీఎస్ఎస్ చైర్మెన్ రాజన్న, రామ్మోహన్‌రెడ్డి, బోయపల్లె శివ, శంకర, మాజీ సర్పంచ్ సుధాకర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు ఈ ఘటనపై తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ధ్వంసం చేసిన ఫ్లెక్సీల స్థానంలో మధ్యాహ్నానికల్లా నూతన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి జన్మదిన వేడుకలను నిర్వహించి అన్నదానం చేశారు. అలాగే టీడీపీ మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, టౌన్ కన్వీనర్ బంగారు వెంకట్రమణలతో పాటు పలువురు నాయకులు బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, చించివేసిన ఫ్లెక్సీల స్థానంలో ఉదయం 10 గంటలకల్లా మళ్లీ కొత్త ఫ్లెక్సీలను తెప్పించి యథాతతంగా ప్రతిష్టించారు. ఫ్లెక్సీల చించివేతపై విచారణ చేస్తున్నట్లు సీఐ జీవన్ గంగనాధ్ బాబు తెలిపారు.

టీడీపీలో చేరిన కదిరాయచెరువు గ్రామస్థులు



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన కదిరాయచెరువు వాసులు

కలికిరి, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): కలకడ మండలం కదిరాయ చెరువు పంచా యతీ బొంతలవారిపల్లె గ్రా మానికి చెందిన 20 కుటుం బాలు వైసీపీ నుంచి టీడీపీ లో చేరారు. గురువారం నగరిపల్లెలో ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి సమక్షంలో వారంతా టీడీపీ లో చేరారు. ఆ పంచాయతీ స ర్పంచు కె.లక్ష్మీప్రసన్న కమలనాథ్, మాజీ సర్పంచు విశ్వనాథం చెట్టి ఆధ్వర్యంలో వార్డు సభ్యుడు నాగరాజ, రెడ్డెప్ప, శ్రీనాథ, గంగాధర, మునీంద్ర, గురవయ్య, ఆనంద, చర్ల రాజన్న, బత్తల చిన్నప్ప, ప్రసాద్, శ్రీనివాసులు, రామయ్య తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు చేయూతనివ్వాలని పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు.

జయచంద్రారెడ్డి సమక్షంలో భారీగా చేరికలు

ములకలచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం నుంచి వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు టీడీపీలోకి చేరారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సమక్షంలో వేపూరికోట వైసీపీ ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, వార్డు మెంబరు శీతిరెడ్డి, నాయకులు కార్యం మోహన, రామచంద్రారెడ్డి, మారెప్ప, ఈశ్వరప్ప, రామచంద్రా, వెంకటరమ, కిష్టా తదితరులు భారీగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి జయచంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవవనరులశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా అన్నదానాలు, కేక్‌లు కట్‌చేసి గురువారం సంబరంగా జరుపుకున్నారు. కాగా మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చిన బాబు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని పలుచోట్ల లోకేశ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొనగా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద కంచెర్ల చింటూ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నీరుగట్టువారిపల్లెలో పేదలకు అన్నదానం నిర్వహించడంతో పాటు, యువకులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో నారా లోకేశ్ టీడీపీ కార్యకర్తలు ఎదుర్కొన్న సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి భరోసా ఇచ్చారన్నారు. మండలంలోని సీటీఎం గ్రామంలో టీడీపీ నాయకులు చల్లా నరసింహులు, రెడ్డిస్వామి, చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వ హించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద 15 అడుగుల లోకేశ్ కటౌట్‌కు శ్రీరామ్‌చినబాబు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కోటి సభ్యత్వాలతో రికార్డు సృష్టించి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొమ్మలపాటి యశశ్వి, గంగారపు బాబురెడ్డి, గౌతమ్‌రెడ్డి, రాట కొండ విష్ణు, బాబి, దొరస్వామినాయుడు, పఠాన్ ఖాదర్‌ఖాన్, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో..

ములకలచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అధ్వర్యంలో గురువారం మంత్రి, టీడీపీ యువ నేత నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక రైల్వేగేటు నుంచి పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్టాండు మీదుగా బస్టాండు సర్కిల్ వరకు భారీ ఎత్తున బాణా సంచా పేలుస్తూ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీగా వచ్చిన టీడీపీ శ్రేణులతో కలిసి జయచంద్రారెడ్డి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సర్కిల్‌లో 42 కేజీల కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంత రం జడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, పారిశ్రామిక వేత్త మంత్రి గిరిధర్ రెడ్డి, కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, చిటికె శివారెడ్డి, నాయకులు భజంత్రి రామాంజులు, జనా ర్ధన్‌రెడ్డి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, సిగి నరసింహులు, ఆంజనేయరెడ్డి, మస్తాన్‌రెడ్డి, సికిందర్, గంగాదేవి

కుండల తయారీపై అవగాహన

బి.కొత్తకోట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని టెర్రకోట కుటీర పరిశ్రమలో కుండల తయారీపై గురువారం విజయవాడకు చెందిన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ఎల్ఎన్ మురళి, రీచ్ ఎన్‌జీవో కృష్ణమూర్తిలు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి కో ఆర్డినేటర్ ప్రమీల, రిటైర్డ్ ఎస్ఐ నాగిరెడ్డి, పలువురు టెర్రకోట కళాకారులు పాల్గొన్నారు

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



మదనపల్లెలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే



ములకలచెరువులో అన్నదానం చేస్తున్న జయచంద్రారెడ్డి



అన్నదానం చేస్తున్న శ్రీరామ్ చినబాబు

పాల్గొన్నారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా అధ్వర్యంలో వేరుగా జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం అన్నదానంలో టీడీపీ నేతలు వెంకటస్వామి, ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్ నా యుడు, కేశవులు, గంగాద్రి, కక్కుల సుదర్శన్, షామీర్ నాగమల్లప్ప, సుధాకర్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, శివన్న పాల్గొన్నారు.

పీటీఎంలో పోటాపోటీగా వేడుకలు

పెద్దతిప్పసముద్రం జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను స్థానిక పీటీఎంలో రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి ఆదేశాలతో స్థానిక బస్టాండు కూడలిలో కేక్ కట్ చేసి లోకేశ్ పుట్టినరోజు వేడుకలను చేసుకున్నారు. అనంతరం తంబళ్లపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ ఆదేశాలతో శంకర్ వర్గీయులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, బందార్ల పెద్ద వెంకట్రమణ, బూర్లపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, పీటీఎం మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, ఇక శంకర్ వర్గీయులు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమక శ్రీనివాసులు, టీడీపీ మండల కార్యదర్శి శివానంద, మండల రైతు సంఘం నాయకుడు తాడిగో ళ్లపల్లె సుదాకర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కత్తి ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ చంద్ర, కాట్నగల్లు రమణ కూటమి నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కందుకూరులో కందుకూరు చెరువు సంఘం చైర్మన్ మండ్లిపల్లె రమేష్ బాబు అధ్యక్షతన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పీలేరులో: రాష్ట్ర మంత్రి, టీడీపీ యువనేత నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం పీలేరులోని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం, నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, పురం రెడ్డమ్మ, షామియాన జయన్న, స్పోర్ట్ మల్లి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, ఐటీడీపీ రెడ్డప్ప రెడ్డి, మునాఫ్ సాహెబ్, వెంకటరమణ నాయక్, లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, రెడ్డిరాణి, స్వర్ణలత, షమ, జీలానీ, మహమ్మద్‌పీర్, ఎన్టీఆర్ నఫీస్, చెన్నారెడ్డి కాలనీ హరి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురంలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గాంధీ బస్టాండ్ ఆవరణలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈసందర్భంగా పేదలకు పండ్లు, రొట్టెల పంపిణీతోపాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు గాంధీపేట రమణ, వీవీ నారాయణ, రామచంద్ర, కోసూరి రమేష్, మురళి, బొక్కసం బ్రదర్స్, కువైట్ సయ్యద్‌బాషా, సయ్యద్‌అమీర్, సైదు, రైల్వే రామచంద్ర, సికిందర్, జావీద్, ఆదినారాయణ, రెడ్డిరామ్, ఆనంద, వాసు, టైలర్ కిట్టు, కూటమి నేతలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గుర్రంకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. తరిగొండ, చెర్లోపల్లెలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్‌నాయుడు, నాయకులు నౌషాద్ అహ్మద్, విజయ్‌కుమార్, రామచంద్ర, తన్వీర్, శంకర, నౌషాద్ అలీ, చంద్రబాబు, ప్రదీప్, వెంకటరమణ, అర్జున్‌నాయుడు, హేస్సాన్ పాల్గొన్నారు.

కలికిరిలో: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖామంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను కలికిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అమరనాథ రెడ్డి భవన్ లో గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్టీసీ రెడ్డెప్ప రెడ్డి, నాయకులు దినకర్, వర్మ, సనావుల్లా, అఫ్రోజ్ బాషా, వెంకటనారాయణ రెడ్డి, శ్రీమన్నారాయణ రెడ్డి, పెద్ద చంద్ర, మునాఫ్, అస్లామ్, జాఫర్, ముస్తఫా, వేణు, జ్ఞానమూర్తి, రత్నాచారి, రత్నశేఖర్ రెడ్డి, గడ్డం ఏసురాజు పాల్గొన్నారు.

కురబలకోటలో: ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌ను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మాజీ సర్పంచ్ రమణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముదివేడులో నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, రామచంద్ర, విశ్వనాథ, రమణ, మోహన్, రాజారెడ్డి, శంకర్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట పట్టణంలో టీడీపీ యువనేత నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మండల టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జ్యోతి చౌక్ కూడలిలో భారీ కేకును కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పలువురి పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ నారాయణస్వామి రెడ్డి, నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కో ఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, నాయకులు సుకుమార్, కనకంటి ప్రసాద్, దేవరింటి కుమా ర్, కురవ ప్రకాస్, సురేంద్ర, చాకన రాజ, బంగారు వెంకట్రమణ, షమీఉల్లా పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండలం కేంద్రంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అంబేడ్కర్ కూడలిలో లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీలు మునివెంకటస్వామి, శివశంకర్, మాజీ సర్పంచ్ ఇంజమ్ వెంకటరమణనాయుడు, కేవీ రెడ్డి, రెడ్డిశేఖర్, మండల యువత అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడు కలను తంబళ్లపల్లె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఉదయం టీడీపీ మం డలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తినా యుడు, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీ ధర్నా యుడు, కొటాల శివకుమార్, ఉత్తమ్‌రెడ్డి, జనసేన నేత ఎద్దుల నరసింహులు లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహిం చారు. మధ్యాహ్నం టీడీపీ మండల బీసీ నాయకుడు పురుషోత్తం, పార్ల మెంటు రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సోము, తెలుగు యువత నరసింహులు, వీరాంజనేయు లు, గంగ రాజు, రాజన్న కేకు కట్ చేసి అన్న దానం చేశారు.

నిమ్మనపల్లెలో: రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మండల టీడీపీ నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్‌లో కేకు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాష మాట్లాడుతూ..రాష్ట్రం అభివృద్ధి పరుగులు తీస్తోందని దీనికి ప్రతి కార్యకర్త ముందుండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ములకలచెరువులో కేక్ కట్‌చేస్తున్న పాలగిరి సిద్ధా

ఏఐపై పట్టు సాధిస్తే.. మెరుగైన ఉద్యోగావకాశాలు

కురబలకోట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై పట్టు సాధిస్తే మెరుగైన ఉద్యోగవకాశాలను సాధించవచ్చని రిసోర్సుపర్సన్ రవి పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఏఐ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేట్ విత్ జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టూల్స్ ఎ కెయెస్‌ఐఎంఈ బేస్డ్ అప్రోచ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి చొక్కానాథమ్ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

పీలేరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతిని గురువారం పీలేరులోని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం బోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతాజీని ఆదర్శంగా తీసుకుని నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మదనపల్లె అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పారిశుధ్య కార్మికుల ఈపీఎఫ్ తదితర సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, కార్యదర్శి సురేష్‌కుమార్, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ నాయకులు దేవా, తిరుమత, ముబారక్, నాగరాజ, కేశవ, ఇంద్రాణి, ఓబులేషు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలను పరిశీలించిన పురావస్తు అధికారులు

తంబళ్లపల్లె, జనవరి 23 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని కోటకొండలో బయల్పడిన మూడు దేవతామూర్తుల విగ్రహాలను పురావస్తు శాఖాధికారులు గురువారం పరిశీలించారు. తంబ ళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మద్దిరాళ్లపల్లె సమీ ప పొలాల్లో కౌలు రైతు వెంకటేశ్ పొలాన్ని దుక్కి దున్నించగా మూడు రోజుల వ్యవధిలో మూడు రాతి విగ్రహాలు బయల్పడిన విషయం తెలిసిందే. ఈ విగ్రహాలను తహసీల్దారు హరికుమార్, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, సిబ్బంది పరిశీలించి పురావస్తు శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో పురావస్తుశాఖ టెక్నికల్ అధికారి రాఘవ, తహసీల్దారు కోటకొండకు వెళ్లి బయల్పడిన మూడు విగ్రహాలతో పాటు ఆ ప్రాంతాలను పరిశీలించారు. విగ్రహాల కొలతలు తీసుకుని వివరాలు సేకరించారు. విగ్రహాలు దొరికిన ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మూడు విగ్రహాలను కోటకొండ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ పెద్దల సమక్షంలో భద్రపరిచారు.

స్థల విషయమై గొడవ..మహిళకు గాయాలు

గుర్రంకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి):ఇంటి స్థలవిషయమై గొడవపడడంతో ఓ మహిళకు రక్తగాయాలైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో శ్యామల(56), కుమార్తె పద్మజతో కలిసి నివాసముంటుంది. ఈ క్రమంలో వారికి పక్క ఇంటికి చెందిన నాగరాజకు స్థల విషయమై వివాదముంది. దీంతో శ్యామలను స్థల విషయమై నాగరాజ, భార్య శ్యామలాలు దాడి చేసి కొట్టారు. ఈ గొడవలో శ్యామలకు తలపై రక్తగాయాలుకాగా ఆమెను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

41 మద్యం బాటిళ్లు స్వాధీనం -వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలి పారు. గురువారం ఆయన మాట్లాడుతూ. ఎర్రప్పగా రిపల్లెకు చెందిన రెడ్డిరాజు(35) గ్రామ శివార్లలో ఆంధ్ర మద్యాన్ని అక్రమం గా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అతని వద్ద నుంచి 41 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మిస్సింగ్ కేసు పోక్సోగా నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి):మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ రహంతుల్లా తెలిపారు. ఈ నెల 9వ తేదీన కనపడకుండా పోయిన. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. పోలీసుల విచారణలో అబ్బాయితో అమ్మాయి బెంగళూరులో ఉన్నట్లు తెలుసుకుని మదనపల్లెకు తీసుకువచ్చి అబ్బాయిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పులు లేని రికార్డుల కోసమే రీ-సర్వే

పీలేరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని రికార్డులు, వివాదాలు లేని గ్రామాల కోసమే రాష్ట్ర ప్రభుత్వ భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కోసం పీలేరు మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన వేపులబైలులో గురువారం రీ-సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తహసీల్దారు భీమేశ్వర రావు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల మేరకు వేపులబైలు గ్రామంలో 3593 ఎకరాల భూమి ఉందన్నారు. రీ-సర్వేలో తొలుతగా గ్రామ పంచాయతీలోని అందరి రైతుల హద్దులు గుర్తించి భూమిని లెక్కిస్తామన్నారు. జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భరత్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గురివిరెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో రీ-సర్వే డీటీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, వసంతాల రాజా, శంకరయ్య, గాయం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఆరోగ్య పింఛన్ల పరిశీలన

తంబళ్లపల్లె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో మూడు రోజులుగా చేపట్టిన ఆరోగ్య పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ గురువారంతో ముగిసింది. మంగళ, బుధ, గురువారాల్లో వైద్య బృం దం అధికారులు డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ సునీల్‌దత్, డాక్టర్ ముని కుమార్‌లు 12 సచివాలయాల పరిధిలోని 89 ఆరోగ్య పింఛన్లను తని ఖీ చేశారు. గురువారం గుండ్లపల్లె, పరుసతోపు, గోపిదిన్నె, కొటాల సచివాలయాల పరిధిలో 31 పింఛన్లను అధికారులు పునఃపరిశీలన చేశారు. అధికారులు నేరుగా పింఛనుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, ధృవీకరణపత్రాలను పరిశీలించారు. అనంతరం నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందచేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జూనియర్ హాకీ బాలికల జట్టు ఎంపిక

మదనపల్లె టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జీఆర్‌టీ హైస్కూల్ మైదానం లో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ బాలికల జట్టు ఎంపిక నిర్వ హించారు. గురువారం హాకీ అసోసియేషన్ సెలెక్టర్లు నిర్వహించి ఎంపికలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి 40 మంది బాలికలు పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ చూపిన 15 మందిని జిల్లా హాకీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్టు సభ్యులు ఈనెల 27, 28 తేదీల్లో సత్యసాయి జిల్లా ఆర్‌డీటీ మైదానంలో నిర్వహించే అంతర్‌జిల్లా సబ్ జూనియర్ హాకీ పోటీల్లో అన్నమయ్య జిల్లా తరపున పాల్గొంటారన్నారు.

లారీ డ్రైవర్లు రికార్డులు చూపకపోతే ఎలా ?

మదనపల్లె అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి):లారీ డ్రైవర్లు పోలీసులకు రికార్డులు చూపకపోతే ఎలా? అని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు ప్రశ్నించారు. గురువారం లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో డీఎస్పీ మాట్లాడుతూ మంగళవారం రాత్రి జరిగిన సంఘటనలో లారీలను పోలీసు స్టేషన్‌కు తీసుకురావాలని కోరినా సీఐని కూడా ఖాతర్ చేయలేదన్నారు. మరుసటి రోజు పోలీసులుతో ఆస్పత్రివద్దకు సీఐ కళా వెంకటరమణ వెళితే తప్పుడు రిపోర్టుతో డ్రైవర్ కాలు పూర్తిగా ఇరిగిందని నమ్మబలికి స్టేషన్‌కు రాకుండా వెళ్లారని సీఐ చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కళా వెంకటరమణ, పోలీసులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రూ.30లక్షలతో అభివృద్ధి పనులు

మదనపల్లె టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో రూ.30లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమి పూజలు నిర్వహించారు. గురువారం స్థానిక ఇండసియల్ ఎస్టేట్, ఎర్రప్పవీధి, గంగమ్మవీధి, ముగ్గురాళ్ల వంక, బెంగళూరుబస్టాండు వద్ద మురుగునీటి కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజలు చేశారు.

రేపు జాబ్‌మేళా

మదనపల్లె టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు, టెన్త్ నుంచి డిగ్రీ చదివిన వారు హాజరు కావాలని కోరారు.

ఎక్సైజ్ వస్తువుల వేలం

మదనపల్లె టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ వస్తువులకు వేలం వేశారు. ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో రూ.7,650 ఆదాయం వచ్చిందని తెలిపారు.